## పశ్చాత్తాప ప్రార్థన

పరమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము,
అపవిత్రమును అగు
మా ప్రతి మాటకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పనికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకు
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అన్నృతమునకు,
సమస్త కపటవర్తనమునకు,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకు,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చిన
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసిన
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపమలన్నిటికిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని
మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలమగుచున్న
మమ్ములను క్షమింప వేడుకొనుచున్నాము.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/
RNP/789/2009-11, Dt.07-01-2009

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి : 8 సంచిక: 11 హైదరాబాద్ 2010 మార్చి పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**



# మండపేటలో ప్రేమిక సహవాస్

తూర్పు గోదావరి జిల్లాలోని మెహెర్ మండపేటలో అవతార్ మెహెర్‌బాబా 2.3.1954లో తన దివ్య పాదములను మోపి స్థానిక ప్రజానీకానికి దర్శన భాగ్యము కలిగించారు. ఆ సందర్భముగా మార్చి 7, ఆదివారం, మెహెర్ సెంటరు నందు ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేయడమైందని శ్రీ ఎం. పనసన్న, సెంటర్ అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఖమ్మం సెంటర్ 47వ వార్షికోత్సవం

**ఏప్రిల్ 25, ఉ.7 గంటల నుండి 2 గం.**

ఖమ్మం సెంటర్ 47వ వార్షికోత్సవం సందర్భంగా బాబా ప్రేమిక సహవాస్ **ఏప్రిల్ 25,** ఆదివారం **ఉ.7 గంటల నుండి 2 గం.** వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ ఆర్. రామచంద్రయ్య తెలిపారు.

# ఎస్.ఎమ్.ఎస్

ఇది మొబైల్ సమాచార యుగం కదా ! మీ బాబా సెంటర్ సమాచారం, సహవాస్ ఏర్పాటు, మీ పోస్టలు అడ్రస్సులో మార్పు- మరేదైనా సరే క్లుప్తంగా, మాకు ఎస్.ఎమ్.ఎస్ పంపండి. మా మొబైల్ నంబరు 995 955 3218.

# srimeherbaba.com

ప్రపంచంలో మీరు ఏ ప్రాంతంలో వున్నా మెహెర్‌బాబా మాస పత్రికను ఇంటర్నెట్‌లో www.srimeherbaba.com లో సందర్శించండి. గత ఏడాది పాత పత్రికలు సయితం, వెబ్‌సైట్‌లో మీరు చూడగలరు. మీ స్పందన తెలపండి.

### ఉగాది శుభాకాంక్షలు

అందరికీ నూతన వికృతి నామ సవంత్సర ఉగాది, హోళి, శ్రీరామనవమి శుభాభినందలను. మన జీవన పథంలో మెహెర్‌బాబానే మార్గదర్శిగా ఏర్పాటు చేసుకోవలయును.

**- సిల్వేరు సుదర్శన్, హైదం**

# హెల్ప్‌లైన్

మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841,** శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- **94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.





# బాబా సందేశం

**If you snap your connections with the world, you become free of all worries.**

**ప్రాపంచిక విషయాలతో తెగతెంపులు చేసుకుంటే మీకు ఎలాంటి ఆందోళనలు, సమస్యలు ఉండవు.**

**- మెహెర్‌బాబా**

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | మా మహారాష్ట్ర యాత్ర | 6-7 |
| 3. | కల్చూరి వంశీయులు | 8-12 |
| 4. | జాగృత స్వప్న స్థితి | 13-16 |
| 5. | విశాఖలో | 17 |
| 6. | బాటసారులు | 18-19 |
| 7 | లార్డ్‌మెహెర్ | 20-30 |
| 8. | బాబా జన్మదినోత్సవాలు | 31-37 |
| 9. | జీవిత సభ్యులు | 38 |
| 10. | ప్రభుస్తుతి | 39 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# మెహెరాబాద్‌లో వేసవి సెలవులు

వేసవి రోజులు, మెహెరాబాద్‌లో తీవ్ర త్రాగు నీటి ఎద్దడి కారణంగా డి.హాస్టలు, యం.పి.ఆర్. గెస్ట్‌హౌస్‌లకు మార్చి 15 నుండి సెలవులు ప్రకటించారు.

బాబా మండలి నివాస ప్రాంగణం, మెహెరాజాద్- కూడా మార్చి 2 నుండి సందర్శకులను అనుమతించరు.

కాగా, మెహెరాబాద్‌లోని-డి, మరియు ఎం.పి.ఆర్.హాస్టళ్ళు మే 26 నుండి తిరిగి బాబా ప్రేమికులకు అనుమతిస్తారని అన్నారు.

# ఆంధ్రా రెస్టు హౌసు

ఆంధ్రా రెస్టు హౌసు బాబా ప్రేమికులందరికీ భోజన, వసతి సౌకర్యాలు (24 x 7) రాత్రింపగళ్ళు భక్తులు ఎప్పుడొచ్చినా కల్పించే ఏర్పాట్ల చేశామని కార్యదర్శి శ్రీ వై. యస్. రావు తెలిపారు. ఈ అవకాశాన్ని బాబా ప్రేమికులు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. రెస్ట్‌హౌస్ నిర్మాణంలో నేటి వరకు గల సుమారు రూ 16 లక్షల రుణం, మరో 60 మంది క్రొత్తగా రెస్టుహౌసుకు జీవిత సభ్యులు కాగల్గితే, ఆ అప్పుకూడా తీర్చినట్లౌతుందని, శ్రీ రావ్ అన్నారు. వేసవిలో బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో మెహెరాబాద్‌కు విచ్చేసి, బాబా వారి ఆశీశ్శులు పొందాలని ఆయన కోరారు.

మరిన్ని వివరాలకు వై.ఎస్.రావు, మెహెరాబాద్, ఫోన్-9848111671 సంప్రదించగలరు.

# మెగా డైరీ

బాబా ప్రేమికుల అడ్రస్సులు, ఫోన్ నెంబర్లతో గల మెగా డైరీని శ్రీ బి. క్రిష్ణయ్య రూపొందించి, ఇటీవల విడుదల చేసిన విషయం పాఠకులకు తెలుసు. కాగా, రాష్ట్రంలో గల బాబా సెంటర్లు ప్రతి వారికి మెహెర్ మెగా డైరీ ప్రతిని ఉచితంగా అందించాలన్నది తమ ఆశయంగా పేర్కొంటూ, బాబా సెంటర్లు ఇంకనూ మెగా డైరీ పొందనివారు దయచేసి వారి సెంటర్ అడ్రస్ వివరాలు పోస్టుకార్డుపై తెలియజేసినట్లయితే, తక్షణం వారికి మెగా డైరీని పంపగలమని శ్రీ బి. క్రిష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ బి.క్రిష్ణయ్య, రిటైర్డ్ సూపరెంటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్, ప్లాట్ నెం.71, వాహిని నగర్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్- 500 009, ఫోన్-040-27897163 సంప్రదించ గలరు.





సంపాదకీయం

# ఫాయిదా

మెహెర్‌బాబా భక్తులుగా మీకేంటి లాభం? ఆయన సహవాస్‌లూ, సత్సంగ్‌లకు వెళ్ళడంవల్ల ఏమైనా ఫాయిదా వుందా? మెహెర్‌బాబా 116 జన్మ దినోత్సవ వేడుకలకు ప్రతిరోజూ పాల్గొన్నవారున్నారు. అడపా దడపా పాల్గొన్నవారూ వున్నారు. బాబా భక్తులుగా ఎవరికివారుగాగానీ, వారికి సంబందించిన వారికి కానీ ఈలాంటి లాభనష్టాల బేరీజు ఆలోచనలు ఏదో సందర్భంలో తప్పక వస్తాయి.

ఇందుకు ఎవరూ మినహాయింపు వుండదు. బాబా మండలి సభ్యుడు, మెహెర్‌బాబాకు అత్యంత ఇష్టుడైన సో. ఏరుచ్‌ని సయితం, బాబా దర్శనార్ధం వచ్చినవారు, ఆయన్ని తరచు రెండు ప్రశ్నలతో వేధించేవారట.

1. మీరెంత కాలం నుండి మెహెర్‌బాబాతో వుంటున్నారు.

2. మరి, మీరింత కాలంగా ఆయనతో వుండటం వల్ల చేకూరిన లాభం ఏమిటి ? అని గుచ్చి గుచ్చి అడిగేవారని సో.ఏరుచ్ స్వయంగా ఓ సందర్భంలో చెప్పారు.

ఈ రెండవ ప్రశ్నకు జవాబు చెప్పడానికి తను చాలా ఇబ్బంది పడేవాడినన్నారు. ఓసారి ఇలాంటి ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి సంశయంలో వున్న ఏరుచ్‌తో, బాబా అయన మనస్సులోని మాటను అడిగి తెలుసుకుని... బాబా ఏమన్నారో తెలుసాండి... **ఏమంత లాభం**? అని కాదు.. ఏమాత్రం పోగట్టుకున్నారన్నది అవతలివాని ప్రశ్న కావాలని సూచించారు.

నాకు సన్నిహితంగా ఎవరున్నా వారి సర్వస్వం, **నేను** అనే భావన సయితం పోగట్టుకుంటారని చెప్పమని బాబా ఏరుచ్‌తో అన్నారు.

**"Remember, whosoever forms a friendship with Me, loses everything, even the self !!."**

**the question should not be "What have you gained by being with Me? but rather, "What have you lost ?"** అని క్లుప్తంగా అన్నారు.

బాబా చెప్పిన మరోమాటను ఏరుచ్ గుర్తుచేస్తూ -'**ముందుగా నేను, నాది అనే భావం పోతే, నీలో నేను ప్రవేశిస్తానని**', **"You Go, then I come."** అని బాబా చెప్పిన మాటలను ఏరుచ్ ఉటంకించారు.

అదీ ఫాయిదా...!!

# మా మహారాష్ట్ర యాత్ర

**- పి.యస్.కె.శర్మ.హైదరాబాద్.**

ఫిబ్రవరి 25న హైదరాబాద్ సెంటర్‌లో, ఆ దరిమలా ఫిబ్రవరి 26,27,28 తేదీలలో జంటనగరాలలో బాబా జన్మదినోత్సవాలు ముగిసాయి. తెలుగువారు బాబా జన్మదినమైన ఫిబ్రవరి 25 కంటే ముందు, వారు వీలునుబట్టి బాబా జన్మదినోత్సవాలు నిర్వహిస్తారు. ఇది మనందరికీ తెలుసు. ఐతే, మహారాష్ట్రీయులు అలా కాదు.

వారు ఫిబ్రవరి 25 తర్వాత నుంచి బాబా జన్మదినోత్సవాలు ఎంతో వైభవంగా మనలాగే నిర్వహిస్తారు. ఈ దఫా వారు ఫిబ్రవరి 25 నుండి 116 రోజులపాటు బాబా జన్మదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు.

మార్చి 6 నుండి 10 వరకూ జరుగుతున్న ఆ కార్యక్రమాలలో పాల్గొనడానికై హైదరాబాద్ తదితర సెంటర్ల నుండి మొత్తం 22 మందిమి, ఓ 5 రోజుల యాత్రపై బయల్దేరాము. ముందుగా మార్చి 6 ఉదయానికి వార్ధా సేవా గ్రాం సెంటర్‌కు చేరాం. వీరి సెంటర్‌కి సొంత భవనాలున్నాయి. స్థానిక బాబా ప్రేమికులు రోజుకొకరు చొప్పున సెంటర్ కార్యకలాపాలు చూస్తుంటారు. మా 22 మందికి ఆ రోజున చక్కని ఆతిధ్యం ఇచ్చారు.

ఇక్కడ ఓ మాట. ఏమంటే, వారు భోజనానికై విస్తరి వేసి, విస్తరి ముందు చక్కగా అలంకరించిన రంగవల్లులకు ముందుగా దణ్ణం పెట్టుకుని ఆపై వడ్డన ప్రారంభించారు. ఇదేమని అడిగితే, **అతిధి దేవో భవ..**అని క్లుప్తంగా సమాధానమిచ్చారు. ఇది ఒక మంచి సాంప్రదాయం అనిపించింది.

ఆ తర్వాత ఆ మధ్యాహ్నానికి 'అమరావతి' బాబా సెంటర్‌కు వెళ్ళాం. వార్ధా నుంచి అమరావతి సెంటర్‌కు ఒకటన్నర గంట జర్నీ పట్టింది. వీరికి కూడా సుమారు 500 గజాలలో నిర్మించుకున్న చక్కని బాబా సెంటర్ వుంది. ఇక్కడ బాబా భజనలు, సత్సంగ్‌లలో పాల్గొన్నాం. అమరావతి సెంటర్‌కు చాలా ప్రత్యేకతలున్నాయి. బాబా ఈ ప్రాంతానికి 1950వ దశకంలో రెండుసార్లు పర్యటించారు. స్థానికంగా బాబా దర్శనం ఇచ్చిన ప్రాంగణాన్ని చూసాం. మన దేశ రాష్ట్రపతి స్వగ్రామం -- అమరావతి. గాడ్గేమహారాజ్ సమాధి ఇక్కడ వుంది. ఇక్కడకి సమీపంలోని బేడీ నది దగ్గర గాడ్గే మహారాజ్ శరీరం వదిలారు. అమరావతిలో ఆయన సమాధి నిర్మించారు. మెహెర్‌బాబా పండరీపురం పర్యటనలో వున్నప్పుడు బాబాను దర్శించుకున్న గాడ్గే మహారాజ్ తనకు ఈ శరీరం నుండి త్వరలో విముక్తి ప్రసాదించమని బాబాని కోరుకున్నాడు. ఆ తర్వాత





కొద్దిరోజులకే ఆయన శరీరం వదిలారని బాబా ప్రేమికులు తెలిపారు.

ఆ మర్నాడు మార్చి 7 నుండి మా యాత్ర కోసం ఓ ప్రైవేటు బస్సు మాట్లాడుకుని, అమరావతి నుండి దరియాపూర్ చేరాం. దరియాపూర్ అంటే ప్రేమ సముద్రం అని అర్ధమట. ఆ పేరుకు తగ్గటగానే ఇక్కడివారున్నారు. దరియాపూర్‌లో ఆ రోజు ఉదయం 9 నుండి రాత్రి దాకా అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ క్రొత్తగా నిర్మించిన బాబా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఎంతో ఘనంగా ఏర్పాటు చేశారు. 2000 చ.మీ. విస్తీర్ణంలోవున్న స్థలంలో ..10,000 చ.అడుగుల మేరలో బాబాసెంటర్ నిర్మాణం, సుమారు 25 లక్షల ఖర్చుతో ఇక్కడ నిర్మించారు.**'భవ్య వాస్తు చే ఉద్ఘాటన్'** అంటే (బ్రహ్మాండమైన సెంటర్ ప్రారంభం) అని పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. మెహెర్‌నాథ్ కల్చూరీ (మెహెరాబాద్) బాబా సెంటర్ నూతన భవనాలను లాంఛనంగా ప్రారంభించి, అవతారుని సందేశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ శాసన సభ్యుడుతో పాటు శ్రీ జాల్ దస్తూర్, శ్రీమతి డాలీ దస్తూర్, శ్రీ శ్రీధర్ కేల్కర్, శ్రీ రమేష్ జంగ్లీ, శ్రీ అన్నా ఖండాలే, మరో ఆస్ట్రేలియన్ బాబా ప్రేమికుడు, ప్రతాప్ ఆహిర్, తదితరులు పాల్గొన్నారు. కళారులకు, తదితరులతో మాకందరికీ జ్ఞాపికలు బహుకరించారు. బాబాకు ఆరతి ఇచ్చాక, సుమారు నూరు మందికి పైగా బాబా ప్రేమికులు, విశేషరీతిలో జానపద నృత్యాలు ఆనంద పారవశ్యంతో చేసి మమ్ములందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. ఆ మర్నాడు మార్చి 8న ఫూల్‌గాం అనే గ్రామానికి వెళ్ళాం. ఇక్కడ 1600 చ.గజాలలో నిర్మించనున్న బాబా సెంటర్ నూతన భవనాలకు శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీతో శంఖుస్థాపన చేయించారు. ఇక్కడనుంచి సెంటర్‌కు వెళ్ళి అక్కడ బాబా సహవాస్ కార్యక్రమానంతరం, ఆ రోజు రాత్రి అర్ధరాత్రి దాటాక అకోలా సెంటర్‌కు చేరాం. బాబా ప్రేమికులు అన్నా ఖండాలే స్వగ్రామం అకోలా. అక్కడ వారి ఆతిధ్యంలో సేదతీరి ఆ తర్వాత **పారస్** బాబా సెంటర్, **అకోట** బాబా సెంటర్లలో సత్సంగ్ కార్యక్రమాలలో పాల్గొన్నాం.

మా ఐదు రోజుల యాత్ర మార్చి 10తో ముగిసి హైదరాబాద్‌కు తిరిగి చేరాం.

మా యాత్రకు శ్రీ బి. రామ క్రిష్ణయ్య నేతృత్వం వహించారు.

అన్ని సెంటర్లలో మా బృందంలోని శ్రీ రామకృష్ణయ్య, శ్రీ పురుషోత్తమరావ్ కులకర్ణి తదితరులు ప్రసంగించారు.

శ్రీ రమణ (పండుగ) బాబా పాటలు పాడారు. చక్కని కార్యక్రమాల్లో పాల్గొన్నామన్న తృప్తితో పాటు, ఈ ప్రాంతీయులు మన హైదరాబాదీయులు కన్నా బాబా ప్రేమలో ఉన్నతం అని నా మటుకు అనిపించింది. ఆత్మ విమర్శ చేసుకోవాలనుకోవడంలో తప్పు లేదు కదా...అనీ అనిపించింది.

# అమరతిథి- కల్చూరి వంశం



మల్లాది రామారావు

ఈసారి అమరతిథి వేడుకల్లో కల్చూరీ వంశస్థులు చాలా మంది పాల్గొన్నారు. కొంతమంది నాగపూర్, ఆ చుట్టు ప్రక్కలనుంచి వస్తే- మరి కొందరు వారి వారి స్వస్థలాల నుంచి వచ్చారు. - ట్రస్టుఛైర్మన్ భావూకూడా కల్చూరీ వంశస్థులే. కల్చూరీ వంశీకులు ఈ దఫా అమరతిథి వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమంది కల్చూరీ వంశీయులు అమరతిథికి హాజరు కాలేదని ఓ సమాచారం.

ఇదిలావుంటే, అమరతిథి రోజైన జనవరి 31న భావూజీ తన ప్రధాన ఉపన్యాసానికి ముందుగా, "కల్చూరీ కుటుంబీకుల్ని అందరినీ వేదిక పైకి రావాలని, భావూజీ వారిని కలవాలనుకుంటున్నారని -- మైకులో అనౌన్సు చేశారు. అలా కల్చూరీ వంశీయులు అందరూ వేదికపై వున్న భావూజీని కలిసారు. ఆ తర్వాత భావూ వారందర్నీ బాబా ప్రేమికులకు పరిచయం చేశారు. అమరతిథి సభా మండపం క్రింద వేసిన వరుస కుర్చీలలో, నేను మూడవ వరసలో వున్నాను.

నన్నూ కల్చూరీ వంశంలో చేర్చారు.

నా పేరును, మల్లాది రామారావుని కాస్తా, భావూజీ మూడేళ్ళ క్రిందటనే **రామ్‌సింగ్ కల్చూరీగా** మార్చారు. బహుశా నా గుబురు మీసాలు చూసి నన్ను రాజ వంశీకుడిగా మార్చేరనుకొంటాను. కనిపించిన ప్రతిసారీ, నన్ను మీసం మెలి వేయమనేవారాయన. అలా నన్నూ కూడా, కల్చూరీగా వేదికపైకి రమ్మనమని పిలిచారు. నా మటకు నేను తటపటయించాను. నేను వేదిక పైకి వెళ్ళకపోవడంతో, ఆ తర్వాత, నన్ను లేచి నిలబడమని, **మీసం మెలి తిప్పమని** ఆదేశించారు.

నేనలాగే చేశాను.

ఆ మర్నాడు, ఫిబ్రవరి 1వ తేదిన రామ్‌సింగ్ కల్చూరీగా తిరిగి నన్ను వేదికపైకి రావాలని పిలిపించారు. అప్పుడు వెళ్ళక తప్పలేదు. బుద్ధిమంతుడైన రాచ వంశీకుడిగా ఈ అరవై ఏళ్ళ వ్యక్తి అందరి ఎదుట నిలబడకా తప్పలేదు.

ఫిబ్రవరి 1వ తేది, మధ్యాహ్నం జరిగిన వాలంటీర్ల సభలో తిరిగి రామ్‌సింగ్





కల్చూరీగా నన్ను మళ్ళీ అందరి ముందుకి పిలిచారు. అమరతిథి వేదికపైనా, వాలంటీర్ల సమావేశంలోనూ, భావూజీ, **తన కల్చూరీ వంశం గురించి, ప్రపంచంలో మూడింట నాలుగు వంతులు మునిగిపోతుందని**, తదితర విషయాలపై అనర్గళంగా మాట్లాడారు.

కల్చూరీ వంశ ప్రస్తావనలో ఆంతర్యం చాలా మందికి అంతుచిక్కలేదు.

"ఏమిటి, భావూజీ **బాబా వేదికపై** , ఓ రాజ వంశం ప్రస్తావన చేయడం అప్రస్తుతం కాదా? అని లోలోపలే కొందరూ, బాహాటంగానే మరి కొందరూ తమ మనస్సులోని మాటను బైటపెట్టారు.

కొందరికయితే ఇది ఓ చక్కని సమగ్ర చర్చనీయాంశమైంది.

అందుకే ఈ సంక్షిప్త వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

**ఇంతకీ కల్చూరీ వంశం ఎక్కడిది? భావూజీ ఏమన్నారు ! దాని కథా కమామీషూ ఏమిటి? ఈ విషయాలపై మెహెర్‌బాబా పత్రిక పాఠకుల కోసం ప్రత్యేకంగా నాలుగు మాటలు...**

ఇప్పటి రాజస్థాన్‌లో కల్చూరీ రాజుల రాజ్యం వుండింది. మన ప్రాంతంలో ఎందరో రాజులు వున్నట్లే, రాజస్థాన్‌ని కూడా ఎందరో రాజులు పరిపాలించారు. బ్రిటీషు వారి కుటిల రాజనీతికి బలయిన రాజవంశాల్లో కల్చూరీ వంశం కూడా ఒకటి.

స్వాతంత్ర్యం వచ్చే నాటికి కల్చూరీ వంశీయులకి పంటలు పండని బీడుభూమి, కొంత అటవీ ప్రాంతం మిగిలింది. బ్రతుకు తెరువు కోసం, వ్యాపారం మొదలుపెట్టారు. వ్యాపారంలోనూ దెబ్బతిన్నారు. పిల్లలకి మంచి చదువు చెప్పిస్తే, వాళ్ళు పైకి రాగలుగుతారని అనుకొన్నారు. ఆ ప్రకారంగానే భావూజీ తనను కాలేజీకి పంపారని, రెండు డిగ్రీలు తెచ్చుకొన్నానని భావూ అన్నారు.

"నువ్వేం చేస్తున్నావ్", అని రామ్‌సింగ్ కల్చూరీగా , భావూ నన్ను ప్రశ్నించారు.

ఏదో కంప్యూటర్లపై పనిచేస్తున్నా. ఇంటర్నెట్‌లో వార్తలు పంపుతున్నాను", అన్నాను.

. "చూసారా! ఇదీ ఇతని పని? వీడి పూర్వీకులు రాజులు. ఇతడేమో ఇలా వార్తలు పంపి, కడుపు నింపుకొంటున్నాడు", అని భావూ పేర్కొంటూ, మీరో సంగతి గుర్తు పెట్టుకోవాలి.

**ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతంకాదు. ఒక పరాత్పరుడు తప్ప. ఆ పరమాత్మ మన ముందున్నాడు మెహెర్‌బాబా రూపంలో.**

**ఈ అవతారుని పట్టుకొంటే మనకి ఢోకాలేదు అన్నారు.**

అలాగే నాకు భావూ మరో ప్రశ్న వేశారు "ఏమోయ్! మీ వాళ్ళంతా ఎక్కడున్నారు ఇప్పుడు"? అని అడిగారు.

ఏం చెప్పాలో పాలుపోలేదు. అందరూ బాబా సేవలోనే వున్నారన్నాను.

ఇందుకూ భావూజీ -- మెహెర్‌బాబాను నమ్ముకోండి. ఆయన ఒక్కడే శాశ్వతం. ఆయన సర్వకాలాల్లో వున్నాడు. మరచి పోవద్దని హెచ్చరికగా అన్నారు.

అలనాట రాజుల భుజ కీర్తుల ధగ ధగలు, ఈనాడు పురాతత్వ ప్రదర్శనశాలలకి పరిమితమయ్యాయన్నారు. కల్చూరీ వంశీకుల కాలంనాటి నాణాలు, కత్తులు మ్యూజియంలలో భద్రంగా వున్నాయి. ఈ రాజ వంశాలు, రాచరికాలు శ్వాశ్వతం కాదు. బాబా కొంగు గట్టిగా పట్టుకోండి అని భావూ చెప్పారు.

**అయితే వచ్చిన చిక్కల్లా ఈ మాటలు, ఆయన ఇంత స్పష్టంగా, కుండ బ్రద్ధలు కొట్టినట్లు చెప్తున్నారా? అంటే, అబ్బే! అలా చెయటం లేదు.**

ఇలా ఎందుకు చేస్తున్నారు? శ్రీ సన్యాసిరాజు విశాఖపట్నం వంటి వారికి, ఇదొక ధర్మ సందేహం.

భావూ తమ వంశీయులకి పెద్దపీట వేస్తున్నారా? వేయదల్చారా ? అనే భావం కూడా మరి కొంతమంది తెలుగువారికి వచ్చిందని సమాచార భోగట్టా.

ఐతే, ఇందులో తప్పు లేదు. కానీ, కాస్తంత వోపికగా పూర్వాపరాలు పరిశీలించండి. మీకే అర్ధమవుతుంది.

తన జీవితాన్ని బాబాకి అంకితం చేసిన భావూజీకి కల్చూరీ వంశంతో ఏమీ పని లేదని మీకే తెలిసివస్తుంది.

దక్షిణాదివారికి, అందునా తెలుగువారికి సామాజిక స్పృహ కాస్తంత ఎక్కువనే చెప్పాలి. ఈ ప్రాంతంలో ఆడవారు మగవాళ్ళతో సమానంగా నిలబడతారు. పెద్దలపట్ల గౌరవంతో కొంచెం తలవంచి నిలబడి మాట్లాడతారు.

హమీర్‌పూర్ స్త్రీల మాదిరి, తలపై నుంచి, ముఖం కనబడకుండా చీర కొంగును ముసుగుగా దర్శించి కనబడరు. దీన్ని వీరు గుంఘట్ అంటారు.

ఉత్తరాది రాష్టాల్లో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో ఈ గుంఘట్ సాంప్రదాయం నేటికీ స్పష్టంగా కనిపిస్తుంది. హమీర్‌పూర్‌కి బాబా మొదటిసారి వెళ్ళినప్పుడు,





బాబావారు ఆడవారిని గుంఘట్ నుంచి బయటకి రమ్మన్నారు.

'మీ తలపై అలా ముసుగు వేసుకొంటే, మీ మొహం నాకు కన్పించదు కదా, అన్నారు. చాలా మంది మహిళలు బాబావారి ఆజ్ఞని శిరసావహించారు. అమరతిధినాడు, ఫిబ్రవరి 1వ తేదీన జరిగిన వాలంటీర్ల సమావేశంలో కూడా గుంఘట్ వున్న మహిళలు చాలామంది హాజరయ్యారు. . అలనాటి బాబా వాక్కుని భావూ గుర్తు చేస్తూ – సంప్రదాయాలు కాలంతో మారాలని హితవు చెప్పారు. ఈ విషయం ప్రస్తావిస్తున్నది ఎందుకంటే, కల్చూరీ వంశ స్తుతి హమీర్‌పూర్ వాసులకోసం. వారివంటి వారి కోసమే. మారుతున్న చరిత్రకి ప్రత్యక్ష సాక్ష్యాలు వారంతా. స్వాతంత్ర్యం తెచ్చిన సామాజిక, రాజకీయ వ్యవస్థలో రాచరికాలు, జమందారీలు, పెత్తందారీలు ఎలా మటుమాయమవుతున్నదీ వారు కళ్ళారా చూశారు. అలనాటి భుజ కీర్తులని ఈనాడు వోట్లుగా మార్చుకొనే ప్రయత్నాన్ని వాళ్ళు చుస్తున్నారు.

**అందుకే రాచరికాలు శాశ్వతం కాదు. బాబా శాశ్వతం అన్న భావూ మాట వాళ్ళకి సూటిగా వారి హృదయాలకి త్రాకుతుంది. వారితో సరిపోల్చితే, తెలుగువారిపై రాచరికపు వ్యవస్థ ప్రభావం తక్కువేనని చెప్పాలి. అందుకనే కల్చూరీ వంశ ప్రస్తావన వీరికి కొంత ఇబ్బందిగా కన్పిస్తుంది.**

భావూజీ చేస్తున్న కల్చూరీ వంశ ప్రస్తుతి వీరికి ఒక హెచ్చరికగా కనిపిస్తుంది. అంత గొప్ప రాజులు, వాళ్ళ వంశీకులు ఏమయ్యారు! అందరూ కాలగర్భంలో కలిసి పోయారు! **కానీ అప్పుడూ,ఇప్పుడూ, రేపు వున్నాడు మన అవతారుడు. బాబాని నమ్ముకోండి. మనసా వాచా బాబా బాటలో నడవండి" అని భావూ చెప్పకనే చెప్తున్నారు.**

నా ఈ వ్యాఖ్య, నా అవగాహన సరైనదేనా అని భావూజీతో తిరిగి సంప్రదించాను.

ట్రస్టు పనుల్లో బిజీగా వుండి కూడా, "నువ్వు సరిగ్గా, చక్కగా, స్పష్టంగా అర్ధం చేసుకొన్నావని జవాబు పంపారు.

నీ అవగాహన నూటికి నూరు పాళ్ళు కరెక్టు అనీ భావూ బదులిచ్చారు.

భావూజీ మంచి మాటకారి. మాటల కోసం ఏ మాత్రం తడుముకోడు. గొప్ప చమత్కారి. అయితే, ఆయన మాట్లాడుతుంటే, మనకొక్కసారి ఆయనేంటి -- అర్ధం పర్దం లేకుండా మాట్లాడుతున్నాడనిపిస్తుంది.

తాత గారిలా ఏదో కథ చెప్తున్నాడులే అనిపిస్తుంది.

మీరు గమనించారో లేదో, భావూ ఎంతసేపు మాట్లాడినా ఆ మాటల్లో అంతర్లీనంగా వో సందేశం కనిపిస్తుంది.

'ఇదర్రా, సంగతి గుర్తుంచుకోండి', అని ఆయన నేరుగా ఏదీ చెప్పరని మన అనుభవం. ఓ వాణిజ్య ప్రకటనలా భావూ సూటిగా మాట్లాడరు. ఆయన మాటలు సూచన ప్రాయంగా ఉంటాయి.

ఈ విషయమే ప్రస్తావిస్తూ, బాబా మండలి సభ్యులందరికీ వారు చెప్పేమాటలు ఏదో సూచనప్రాయంగా చెప్పటమే అలవాటని, బాబా ప్రేమికులు శ్రీ బాల క్రిష్ణ మెహెర్ (హైదరాబాద్) అభిప్రాయపడ్డారు. అదీ నిజమే.

**అది బాబా భౌతిక దేహం వదిలిన తొలి రోజులవి. ...బాబా ప్రేమికులు, ఇంకా ఆ బాధనుండి తేరుకోలేదు. అదీ ఆ సందర్భం...**

మండలి సభ్యుడు సో.ఏరుచ్ ఓ రోజు రాత్రి, గ్లో ఆంగ్ల పత్రిక సంపాదకుడు నౌషర్‌వాన్‌ను తనతో మెహెరాజాద్‌లోని బాబా నివాస ప్రాంతానికి కొద్ది దూరంగా మాట్లాడ్డానికై తీసుకెళ్ళి... ఇదిగో .. ఇది ఆలకించమన్నారు.

వారున్న చోట నుంచి కొద్దిపాటి దూరంలోని పొలాల్లో మేకలు .... బా..బా...బా..బా... అని అరుస్తున్నాయి. నౌషర్‌వాన్ ఏమంటారు..

ఆ మేకలు బాబా ... బాబా... అని పిలుస్తున్నట్లు వుందన్నారు. ఐతే ఏరుచ్.... ఆ మేకలున్న దిక్కుకు ఎదురుగా, దూరంగా వున్నది చూడమంటే, ,ఆ చిమ్మ చీకట్లో నౌషర్‌వాన్‌కు ఏమీ కనపడదు.

ఏదో నల్లగా, ఎత్తుగా, రాతి కొండలా ఓ ఆకారం కనిపిస్తుంది.

ఆ తర్వాత తదేకంగా చూస్తే...ఓ గొర్రెలకాపరి, నల్లని కంబళి కప్పుకుని, రాతి కొండలాగే.. ఆ పొలాల్లో వున్న తన గొర్రెలకు కాపలాగా వున్నాడు.

ఐతే, ఆ మూగజీవాలు, తమకు కావలకాసే యజమాని ఎటో వెళ్ళాడన్న భయంతో బా....బా...బా...బా అంటూ రోదిస్తున్నాయి .. అని ఏరుచ్, నౌషర్‌వాన్‌తో అన్నారు.

నౌషర్‌వాన్ ..సునిశిత పత్రికా సంపాదకుడు కదా... నర్మగర్భంగా మాట్లాడే .. ఏరుచ్ మాటల్లోని అర్థాన్ని ఇట్టే పసిగట్టాడు.

**మండలి వారి మాటలు ఇలాగే ... సున్నితంగా సూచనప్రాయంగా వుంటాయి.**

**ఎవరి స్థాయిలో వారు అర్థం చేసుకోవల్సిందే...కల్చూరీ వంశం మాదిరి.... .**

❋





# జాగృత స్వప్న స్థితి నుండి నిజమైన జాగృత స్థితి

(The Everything and the Nothing - by Meher Baba)

సంకలనం- వి.ఆర్.కె.శాస్త్రి

**అనంతం** యొక్క మొట్టమొదటి పాట సృష్టి ఆరంభం. ఇది అనేక ద్వంద్వముల సామ్రాజ్యంలోనికి అనంతం దిగి రావడాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ద్వంద్వము అంతులేని బాధలతో కూడుకుని యున్నది.

నేను అనంత ఏకైకకుడనని నాకు తెలియుటవలన నేను శాశ్వత ఆనందాన్ని కలిగియున్నాను. ఉన్నది నేను మాత్రమే. నేను తప్ప మిగిలినదంతా శూన్యమే. మిగిలినదంతా భ్రాంతి. నేను ఆనందంతో పాటుగా, శాశ్వతంగా బాధనను భవిస్తున్నాను. నేను నాకుగా స్వతంత్రుడను. కాని, మీలో మీరుగా, నేను నా అంతట నేను బంధీనవుతాను. మీకు బంధముల నుండి స్వేచ్ఛ కలిగించుటకు, మీ వలన నేను ఎరుకతోనే బాధననుభవిస్తున్నాను. ఇది నాకు శిలువ. మీరు దుఖముననుభవించుట కేవలం అజ్ఞానం వలననే. మరి మీ అజ్ఞానం నాకు బాధను కలిగిస్తుంది.

ఇక్కడ నా యెదుట మీరు కూర్చుని యున్నారు. ప్రతి ఒక్కరు మరొకరి నుండి ప్రత్యేక ఉనికిని స్థిరపరుచుకున్నారు. మీరు సమాజంలోని విభిన్న స్థాయిల నుండి వచ్చారు. మీరు విభిన్న శారీరక, మానసిక అభిరుచులు, సామర్థ్యాలు కలిగియున్నారు. అహంకారపూరిత మనస్సువలన మీరు ఎవరికివారుగా మారి అవిభాజ్యమైన ఒకే పరమాత్మ అపరిమితంగా విభజింపబడింది. కాని పరమాత్మ ఎన్నిటికి వేరు చేయబడదు. అది ఎప్పుడు ఒకటే అయివుంటుంది. మీరు నిజంగా ఆ అనంత పరమాత్మే. కాని పరిమిత మనస్సుతో మిమ్మల్ని మీరు గుర్తించుకుంటు ఆవిధంగా బాధపడుతున్నారు. మీకు సంతోషకర క్షణాలు వుంటాయి, బాధాకర క్షణాలు వుంటాయి. నీ ఆనందం నీ దుఖం కన్న ఎక్కువగా వున్నా, లేక నీ దుఖం నీ ఆనందంకన్నా ఎక్కువగా వున్నా నీ ఆనందం, దుఖము ఏ స్థాయిలో వున్నా, నీ పరిమిత వ్యక్తిత్వం గాఢనిద్రలోనికి జారుకునే వరకు, ఏదో ఒక దాని గురించి నీవు రోజంతా చింతిస్తూనే వుంటావు. అక్కడ (గాఢనిద్రలో) నువ్వు అచైతన్యంగా అనంతంలో లీనమవుతావు.

గాఢనిద్రలో నిన్ను నీవు, నీ పరిసరాలు, నీ ఆలోచనలు మరియు ఉద్రేకాలు, సుఖదుఖాలన ,గురించి నీవు ఊహించుకున్న అభిప్రాయాలు యేవైతే నీ చుట్టు వ్యాపించి వున్నాయో వాటిని నువ్వు పూర్తిగా మర్చిపోతావు. కాని యీ విరామం కొద్దిసేపే వుంటుంది.

గాఢ నిద్రావస్థనుండి నువ్వు సాధారణ జాగృతి (మెళకువ) స్థితికి చేరుకుంటావు. మరినువ్వు అలా చేరుకునునప్పుడు, ఆ స్వప్నస్థితి ఒక లిప్తకాలమే (క్షణంలో ఒకవంతు) వున్నప్పటికి, నువ్వు తప్పనిసరిగా ఒక స్వప్న స్థితిని దాటి రావాలి.

ఇప్పుడు, ఒకసారి నువ్వు చాలా సంతోషకరమన, మధురమైన కలగంటావు. అందులో (ఆ కలలో), నీ ఊహల్లో ఏ ఆనందాన్ని నువ్వు పొందాలనుకుంటావో, అది నెరవేరుతుంది. కాని అది కల కనుక కొద్దిసేపటికే మటుమాయమవుతుంది. మరి మెళకువ నీకు ఎంత బాధ కలిగిస్తుందంటే, ఎంత దయనీయం ఇది కల మాత్రమేనా అని నువ్వు నిట్టూర్చుతావు. ఇంకొకసారి గొప్ప బాధననుభవిస్తున్నట్లున్న ఒక ఘోరమైన కలగంటావు. అప్పుడు కాలం అంతులేనిదనిపిస్తుంది. నువ్వు మేలుకున్నాక ఎంత ఉపశమనం పొందుతావంటే, ఇది కేవలం కల మాత్రమే కనుక దేవుడా నీకు కృతజ్ఞతలు అని చెప్తావు.

స్వప్న స్థితిలో నువ్వు ఆనందిస్తావు, దుఖిస్తావు. నీకు మెళకువ వచ్చాక, నీ ఆనంద దుఖాలు కల తప్ప మరేమి కాదు, ఇది ఒక భ్రమ అని తెలుసుకుంటావు. కాని మెళకువ అని నీచే పిలువబడుచున్న నీ యొక్క ప్రస్తుత చైతన్యస్థితి, నిజమైన జాగృతి స్థితితో పోల్చినప్పుడు, ఇది (నీ ప్రస్తుత చైతన్య స్థితి) ఒక స్వప్నస్థితి తప్ప మరేమి కాదని తెలుసుకో విశ్వము అనే భగవంతుని యొక్క పద్దకలలో నీ జీవితం ఒక కల.

నీ ప్రస్తుత జాగృత స్వప్నావస్థనుండి నిజమైన జాగృతిస్థితిలో స్థిరపడేవరకు నువ్వు చాలా మరణముల యొక్క నిద్రల ద్వారా ప్రాణించవలసి వుంటుంది. సాధారణ నిద్ర తర్వాత నువ్వు ఆ పరిసరాలలోనే మేలుకుంటావు. మరణానంతరం నువ్వు క్రొత్త వాతావరణంలో లేస్తావు. కాని యిది నీ దుఖమును అంతం చెయ్యదు. కర్మ పరంపరలు తెగిపోకుండా, వైఫల్యం చెందకుండ నీ జీవితాన్ని నిర్దేశించి వుంచుతాయి. కొత్త వాతావరణం కొత్త చింతలను సృష్టించడం దీనిలోని చమత్కారం. మాయ యొక్క పట్టు ఎంత గట్టిది, మోసపూరితమైననది అంటే, నువ్వు వ్యాకుల పడకుండా వుండలేవు (పడక తప్పదు) అందువలన నీ జీవితం నీ జాగృత స్వప్నస్థితిలో అంతులేని దుఖపరంపరగా మారుతుంది.

నీ నిజమైన ఆత్మను నీవు తెలుసుకునే వరకు, నువ్వు యీ భౌతిక శరీరంతో మళ్ళీ మళ్ళీ జన్మించాలి. నువ్వు మనస్సుగా (మనో శరీరంగా) ఒక్కసారే జన్మిస్తావు, ఒక్కసారే మరణిస్తావు. ఈ విధంగా చూస్తే నువ్వు తిరిగి జన్మించవు. భౌతిక శరీరం మారుతూనే వుంటుంది. కాని మనస్సు (మానసిక శరీరం) చివరి వరకు అలాగే వుంటుంది. అన్ని ముద్రలు (సంస్కారాలు) మనస్సులో కూడబెట్టబడతాయి. ఆ సంస్కారాలు ఖర్చు





చెయ్యబడాలి. లేదా క్రమానుసారంగా వచ్చు జన్మలలో తాజా కర్మలద్వారా వ్యతిరేక క్రియతో నిరోధించబడాలి. బుద్ధి చక్రం జననమరణ ఆవృత్తిని (పర్యాయమును) సూచిస్తుంది. ఆ చక్రం అనివార్యంగా తిరుగుతూనే వుంటుంది. అది నిన్ను ఉన్నత శిఖరాలకు తీసుకుని వెళుతుంది, అది నిన్ను అగాధాల్లోకి తోసేస్తుంది.

ఒక బంధాన్ని కర్మ యే విధంగా ఏర్పరుస్తుందో, ఒక జీవితం రాబోయే (భవిష్యత్) జీవితాలతో ముడిపడివుండటానికి కర్మ యే విధంగా కొనసాగుతుందో తెలియడానికి నేనొక ఉదాహరణ యిస్తాను. ఒకరాజు అపార రాజ్య సంపదలు కలిగి యున్నాడు. కాని అతడొక పనికిమాలిన రాజు. అతడు తన యావత్ శక్తి సంపదలు స్వార్ధ పూరిత కార్యకలాపాలకు, విలాసాలకు ఖర్చు చేసేవాడు. ఈ విధంగా అతడు తన ఏలు బడిలోని ప్రజలను పట్టించుకునేవాడుకాదు. ఆ రాజు తన తరువాత జన్మలో ఒక గుడ్డివాడిగా జన్మించి, బిచ్చగాడిగా మారతాడు. ఆ విధంగా అతడు తను చేసిన తప్పులకు తగిన ప్రతిఫలం చెల్లించాడు.

ఇంక ఆ రాజుకి ఒక నిజాయితీగల నమ్మకమైన కష్టపడి పనిచేసే సేవకుడున్నాడు. అతడి సుగుణాల కారణంగా ఆ సేవకుడు తన తరువాత జన్మలో ఒక సంస్కారవంతమైన మంచి సంపన్న కుటుంబంలో జన్మించాడు. ఒకనాడు అతడు వీధిలో నడిచి వెళుతుండా, ప్రక్కనుండి ఒక హృదయ విదారకమైన ఏడుపు విన్నాడు. ఆ ఆక్రందన, క్రిందటి జన్మలో మహారాజుగా వున్న ఆ గుడ్డి బిచ్చగాడిది. చేతులు చాచి, దయ చూపండని, భగవంతునిపేరిట ఒక పైసా యివ్వండని అర్ధిస్తున్నాడు. కర్మలు ఎంత అల్పమైనవైనప్పటికి, సంస్కార బంధనాల వలన అంతర్గతంగా నిశ్చయింపబడి, తనదని అడుగు హక్కులను, తను యివ్వవలసిన బాధ్యలను కల్పిస్తాయి. కావున ఆ ధనికుడు అసంకల్పితంగా ఆ బిచ్చగాడి దగ్గరకు వెళ్ళి కొన్ని రాగి నాణేలను అతనికి యిస్తాడు. ఒక మహారాజు బిచ్చం కొరకు ఆక్రోశిస్తున్నాడు. మరి ఒక సేవకుడు అతనిపై జాలి చూపిస్తూన్నాడు. ఎంత హాస్యాస్పదం, ఎంతటి విధి పరిహాసం! ఇది విలువలతో కూడిన ప్రపంచంలో న్యాయ వ్యక్తీకరణగా కర్మ సిద్ధాంతం యొక్క పనితీరు. కర్మ సిద్దాంతం నిష్పక్షపాతమైనది, కౄరమైనది. దానికి (కర్మ సిద్దాంతానికి) రాయితీలు తెలియవు, ప్రాధాన్యతల నివ్వదు, మినహాయింపులు లేవు. అది న్యాయమును సమకూరుస్తుంది.

దివ్య శాసనం ద్వారా గత జన్మల స్మృతి నీకు లేకుండా చెయ్యబడింది. ఎందుకనగా అది (గత జన్మల స్మృతి) ప్రస్తుత జన్మ జీవించుటకు సహాయకారికాకపోగా దాన్ని (ప్రస్తుత జన్మను) ఎంతో క్లిష్టమైనదిగాను, చికాకుల మయంగాను చేస్తుంది.

నాకు గత మన్నది లేదు. నేను శాశ్వత వర్తమానంలో జీవిస్తాను. ఎంతో మంది

వ్యక్తులతో మీ అన్యోన్యతతో పాటుగా, చిక్కులతో కూడుకున్న సంబంధాలన్నిటితో సహా మీ యొక్క గత జన్మలను నేను స్పష్టంగా చూస్తున్నాను. ఈ జన్మలో యితరులతో మీ వివిధ స్పందనలను, మీ ముందు జన్మలో మీ సంబంధాలను, పూర్వోత్తర సందర్భాల పరంగా చూడడం నా కొక పెద్ద పరిహాసంగా పనిచేసి, నా భాధల బరువును తగ్గిస్తుంది.

ఇప్పుడు నేనొక ఉదాహరణ యిస్తున్నాను. ఇది అసాధారణ సంఘటనేమికాదు. ఒక మహమ్మదీయుడు చనిపోయాక, ఖననం చెయ్యబడ్డాడు. కొన్ని జన్మల తరువాత, అతడు తిరిగి అదే పట్టణంలో ఒక మహమ్మదీయ కుటుంబంలో జన్మించాడు. శ్మశానానికి వెళ్ళినప్పుడు, చనిపోయిన వారిని రక్షించమని ఆ సర్వశక్తిమయ భగంతుడిని ప్రార్థించడం మహమ్మదీయులలో సర్వసాధారణ ఆచారం. అందువలన యీ వ్యక్తి తన స్వంత సమాధి ముందు నిలబడి, మతానుచారపరంగా 'భగవంతుడు అతడి ఆత్మను రక్షించుగాక!' అని ప్రార్థించడం జరిగింది. ఎంత అసంగత విషయం! ఎలాంటి జాలిగొలిపేది!

జనన మరణ చక్రం ఎడతెరిపి లేకుండా నిరంతరం తిరుగుతుంది. ఒక పురుషునిగా, స్త్రీగా, ధనికునిగా, పేదవానిగా, తెలివైనవానిగా, మందబుద్ధిగా, పేదవానిగా, తెలివైనవానిగా, మందబుద్ధిగా, ఆరోగ్యవంతునిగా, బలహీనునిగా, నల్లగా, తెల్లగా, వివిధ జాతులలోను, వివిధ తెగలలోను విధాయకంగాను, సహజమైన అవసరాలకనుగుణంగాను అన్ని రూపాల ద్వంద్వ పరిధిని దాటుటకు సహాయపడు ఆ అనుభవ సంపదను పొందుటకు నీవు జన్మిస్తావు. ఆ అనుభంతో పాటుగా ఇవ్వడం (చెల్లించడం) పుచ్చుకోవడం (తీసుకోవడం) యొక్క కర్మ రుణాల చెల్లింపు కూడా నిరంతరంగా కొనసాగుతునే వుంటుంది. ఈ లెక్క (ఖాతా)ను నీవు ఎలా సరిపెడతావు (పరిష్కరిస్తావు)? విశ్వాత్మక మనస్సు కలిగిన అవతారుడు లేక సద్గురువు సబ్దార్థ పూర్వకంగా సశరీర విశ్వాత్మక జీవితమును కలిగి వుంటాడు. అతడి (అవతారుడు) ద్వారానే నువ్వు యీ కర్మ వ్యాపారమునుండి విముక్తుడవుతావు.

మొత్తం అంతటి యొక్కయు, ప్రతివారి యొక్కయు జీవితం నాకు తెరిచియున్న పుస్తకం. ఇది నాకు నేనుగా మూల్యం చెల్లించి ఆనందం పొందేటటువంటి ఒక చలనచిత్ర ప్రదర్శన లాంటిది. నిరంతరం మారిపోతూ, ఎన్నటికి అంతం కాని చలన చిత్రమనబడు యీ విశ్వమునకు నేను ఏకైక నిర్మాతను. ఇందులో నిన్ను నిజమైన జాగృత స్థితికి మేల్కొల్పడానికి, నీ జాగృత స్వప్న స్థితిలో నేను నీవవుతాను, నీవు యీ స్థితిని (నిజమైన జాగృత స్థితి) అనుభవించినప్పుడు, జాగృత స్వప్న స్థితిగా యిప్పుడు నీవు దేనిని అనుభవిస్తున్నావో దాని శూన్యతను నీవు గ్రహిస్తావు. దీనికి నా కృప కావాలి. నా కృప ప్రసరించినప్పుడు, అది (నా కృప) నిన్ను నన్నుగా చేస్తుంది.. ❊





# వైజాగ్‌లో వైభవంగా బాబా జన్మదినోత్సవాలు

ఫిబ్రవరి ఐదు నుండి మొదలైన మెహెర్‌బాబా 116వ జన్మదిన వేడుకలు విశాఖ నగరం మొత్తం ఇరువై రోజులు వరుసగా వివిధ ప్రాంతాలలో ప్రేమికులు ఉత్సాహంగా జరుపుకున్నారు. శ్రీ కె.వెంకట్రావు, శ్రీ ఎల్.వి.ఆర్ మూర్తి, శ్రీమతి ఉషాదేవి, బాబా తత్వ ప్రసంగాలు చేసి ప్రేమికులకు, నగరవాసులకు బాబా విశేషాలను అందించారు.

ఫిబ్రవరి 25న ఉదయం 5 గంటలకు ఆరతితో ప్రారంభమై మధ్యాహ్నం వరకు బాబా సంకీర్తన, ఉపన్యాసాలతో షిప్ యార్డు కాలనీలో నున్న సెంటర్‌లో సహవాస్ కొనసాగింది. తిరిగి నగరం నడిబొడ్డులో నున్న 'శుభం' అనే ఓపన్ ఎయిర్ కళ్యాణ మండపంలో, సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆంధ్రా యూనివర్సిటి అసిస్టెంట్ రిజిస్ట్రార్, శ్రీ కె. వెంకట్రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తదితరులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రతిభావంతులైన 60 మంది పేద పిల్లలకు స్కాలర్‌షిప్‌లు బహూకరించడమైంది.

అనంతరం, కుమారి కిరణ్మయి చేసిన నృత్యం అందరినీ అలరించింది.

**ఉరకలెత్తిన ఊరేగింపు**

ఫిబ్రవరి 27న విశాఖ నగరంలోని ముఖ్య ప్రాంతాలలో సుమారు 300 మందితో, గుర్రపు రథంపై బాబా చిత్ర పటాన్ని అందంగా అలంకరించి గొప్ప ఊరేగింపుని నిర్వహించడమైంది. బాబా వారి ప్రసాదం, కరపత్రాలు, ఫోటోలు స్థానిక ప్రజలందరికి పంచడమైంది. విశాఖ సెంటర్, కార్యదర్శి, మెహెర్ ప్రకాష్, కోశాధికారి అప్పలనారాయణల నేతృత్వంలో బాబా జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. డా॥ నికుంజ్ వందన సమర్పణ చేశారు.

**– హరిమెహెర్**

# నిర్యాణం

## శ్రీ ఎమ్.బి.జి. శాస్త్రి గారి భార్య

శ్రీమతి మంత్రవాది వన లీలాదేవి (82) మార్చి 6, శనివారం, ఉదయం 7 గంటల ప్రాంతంలో బాబా నామజపంతో అవతారునిలో ఐక్యమయ్యారని, ఆమె కుమారుడు డా॥ కైలాష్ తెలిపారు. ఆమెది సునాయాస మరణం అని చెప్తూ, ఆమె శనివారం ఉదయం నిద్ర నుండి లేవనేదని, నిద్రలోనే తుదిశ్వాస వదిలారని డా. కైలాష్ అన్నారు.

యం.బి.జి. శాస్త్రి గారు నవంబరు 2001లో బాబాలో లీనమయ్యారు.

*(గత సంచిక తరువాయి)*

# బాటసారులు

**బా**బా లేని సమయములలో ఆశ్రమ కార్యముల నిర్వహణలో అశ్రద్ధ జరుగుచుండెనని అనుకొనుట కేమాత్రము వీలులేదు. బాబా ఇచ్చిన ఆదేశముల ప్రకారం అన్ని పనులు చక్కగా దినదినము జరుపుచుండిరి. ఈ కాలమునందు క్రొత్త విశేషములేవీ ఆశ్రమములో జరుగకపోయినను ఆశ్రమ కార్యములన్నియు ఆశ్రమ సేవలకు తమ నిస్స్వార్థ సేవ వలనను, నిజాయితీవలనను యధావిధిగా చేయుచుండిరి.

పంచగనినుండి తిరిగివచ్చిన తరువాత "రాజా గోపీచందు" అను నాటకం ఆడించవలెనని బాబా నిర్ణయించుకొనుటతో మార్పుకలిగినది. ఆశ్రమవాసులందరితోను బాబా ప్రేమ పూర్వకమైన తన అంతరంగిక సాంగత్యము ప్రారంభించి ఈ కొద్ది మాసములు 15 సెప్టెంబరు 1938 తేదీనాడు నాటకము వరకు తన కార్యక్రమమును బాబా తీవ్రముగా సాగించిరి.

నాటకమూ రాజాగోపీచందు యొక్క ఉత్తమమైన చరిత్రనుగురించి, అందు పిచ్చి వారే ముఖ్య పాత్రధారులు. భగ్నమతులైన వీరిచేత ఎవరెవరి పాత్రలకు తగునట్లు వారు వారు నటించుటయందు వారి స్థానము లెక్కడ ఉండవలెనో హావభావములు ఎట్లు వ్యక్తీకరింపవలెనో రంగముమీద ఏ యే సమయములందెవరెవరు ఎట్లు నటించవలెనో వారినందరిని తరిఫీదు చేయించిన ఘనత ప్లీడర్‌కు చెందును. అతడు ఎంతో ఓర్పుతో నయాన్ని భయాన్ని వారందరిని తయారు చేసెను. ఒక నాటకసంస్థ వారి దగ్గరనుండి వేషదారణకు కావలసిన దుస్తులు వగైరా నాటకమునకు కావలసిన సీనులు అన్నీ అద్దెకు తీసికొనెను. నాసిక్, పూనా ఇంకా బొంబాయి నుంచి కూడా బాబా శిష్యులనేకమందిని ఆహ్వానించగా వారందరు చూచిరి. నాటకాలాడుటయే వృత్తిగాగల నటకులవలె లేకపోయినను. నాటకము అన్ని విధములా చాలా జయప్రదముగా జరిగినది.

ఈ నాటకముతో పిచ్చివారియెడల బాబా చేయవలసిన పనియందు పెద్ద ఘట్టము ముగిసినది. ఇది లగాయతు బాబా వారితో అంతసన్నిహితంగా ఉండుట క్రమక్రమంగా మానుచూవచ్చెను. అప్పటినుండియు తాను ముందు చేయబోవు కార్యముల ఉన్నత శిఖరములు కనుపింపసాగెను. 1940లో ఆశ్రమం పూర్తిగా ఎత్తివేయబడువరకు అక్కడ కలిగిన మార్పులను కొంతవరకు చెప్పెదను.

'రాజాగోపీచందు' నాటకం ఆడిన తదుపరి ఇరవై మందిని మాత్రము ఆశ్రమములో ఉంచి మిగతావారని వారి యిండ్లకు పంపివేసిరి, డిసెంబరు 1938లో బాబా దూర ప్రయాణం చేయుటకు మెహెరాబాదు విడిచివెల్లిరి. ఈ ప్రయాణమునందు





మెహెరాబాదులోని ఆశ్రమమును ముఖ్యంగా బైదుల్ చూచుచుండెను. తరువాత మే (1939) నెలవరకు బాబా మెహెరాబాదుకు తిరిగి రాలేదు. వచ్చినప్పుడు ఒక నెల మాత్రము ఆశ్రమ వ్యవహారములు ఆయన నిర్వహించు చుండిరి. బాబా రాక వర్షాకాలము చలికాలము వెళ్ళిన తరువాత వసంతాగమమువలె తోచుచుండెను. బాబా వచ్చిన తరువాత కొన్ని వారములు మండలివారు ప్రతిదినము బాబా కుటీరములోనికి బయటకు వెళ్లుట టెలిగ్రాములు వగైరా అనేకంగా వచ్చుచుండుట ఏదో క్రొత్త కార్యక్రమం మరల ప్రారంభించెదరేమో యనునట్లుగా అట్టహాసము కనిపించుచుండెడిది.

జూలై నెలాఖరుకు బాబా బెంగుళూరు వెళ్ళిరి, సెప్టెంబరులో ఈ పిచ్చి ఆశ్రమము తీసికెళ్ళి బెంగుళూరులో నెలకొల్పిరి. మండలివారి గృహము వెనుక నున్న సాలలలో ఈ పిచ్చివారిని బసచేయించిరి. తోట యంతయు తిరుగుటకు వారికి స్వేచ్ఛ యివ్వబడినను సందెచీకటి వలెనుండు వారివారి గదులయందో లేక బయటనున్న పలుచని గడ్డిమీదో వారు కూర్చుందురు. మొదట్లో బాబా రోజుకొక పర్యాయమువచ్చి ఒకరిద్దరిని స్నానము చేయించి, ఆ వురుషులను ప్రేమాలింగనముతోనో, చెవి మెలిపితోనో ప్రేమపూరితమన తన యుత్సాహ మధురసము నందు వారిని ముంచి పోవుచుండెడి వారు.

ఆశ్రమం వచ్చిన కొద్దిరోజుల యనంతరము ప్రక్కయింటి పిన్ని గారొకావిడ ఇందులో మిక్కిలి యపాయకరముగు పిచ్చి వారున్నారని విని అట్లువారిని తన యింటికి అంత దగ్గరలో బస చేయించి తన యొక్క తన సేవకుల యొక్క క్షేమమునకు ఆపద కలిగించినందుకు తన దిగ్భ్రాంతిని తెలియజేస్తూ ఒక ఉత్తరం వ్రాసి పంపినది. ఇందుకు జవాబుగా నొరీనా స్వయంగా ప్రక్క యింటావిడను చూచుటకు వెళ్ళగా ఆవిడ చాలా మనోహరంగానూ, సానుభూతితోను తను చెప్పిన మాటలు వినగా ఆమె యొక్క భయం తీర్చి వచ్చినది? అయినా కొద్ది రోజులలో ఆశ్రమానికి ప్రక్క యింటికి మధ్య గోడమీద ఒక మనిషి యెక్కి గాజుపెంకులు అతికించడం కనుపించింది.

బెంగుళూరుకు వచ్చన కొద్దిరోజులలోనే ఆ తోటలో ఒకమూల ప్రత్యేక్మైన ఒక మస్తు ఆశ్రమం నెలకొల్పేరు. ఈ ఆశ్రమం నాలుగవ అధ్యాయంలో వర్ణించబడినది. బాబాయొక్క పని యెక్కువగా ఈ చిన్న ఆశ్రమంలో గొప్ప మస్తులతో ఉంటూ యుండెడిది. అయినను పిచ్చాశ్రమంతో బాబాకు సంబంధం ఉంటూనే ఉండేది, అయితే అంత ప్రాముఖ్యత వహించలేదు. తరువాత వారాలలో మస్తులతో బాబా కార్యక్రమం పతాక స్థాయి నందుకొనే సరికి చాలా రోజులు బాబా పిచ్చి ఆశ్రమానికి తరచు వెళ్లడమే మానేశారు. అయితే బైదుల్ ప్రతి ఉదయం మహమ్మద్‌ని ఇంకో అయిదుగురు పిచ్చివారిని వెంటబెట్టుకొని మస్తు ఆశ్రమానికి తీసుకు వెళ్ళుచుండును. **(సశేషం)**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

**అ**బ్దుల్లా, రాజారామ్‌లు దివ్యానుభూతిలో మునిగి తేలుతున్నారు. వీరికి స్థూల ప్రపంచ స్పృహ లేదనాలి. వీరిద్దర్నీ మన లోకం లోనికి తీసుకురాకపోతే మంచిదికాదనిపించింది బాబావారికి. అందుకనే జనవరి 24వ తేదిన రావ్ సాహెబ్‌కి కబురు పంపారు. ఈ పిల్లలకి ఎనిమా చేయమన్నారు.

అబ్దుల్లాకి ముద్దు పేరు చోటా బాబా.

బాబా చెప్పిన ప్రకారం, ఎనీమా చేద్దామని వాళ్ళున్న గదికి రావ్ సాహెబ్ వెళ్ళే సరికి పదకొండు గంటలైంది. ఎనీమా చేస్తున్నంత సేపూ, అబ్దుల్లా హృదయ విదారకంగా ఏడుస్తూనే వున్నాడు.

ఇదేమిటి? ఏంచేస్తున్నారు. నాకు వద్దు బాబూ! అసలు మీ ప్రపంచం నాకు వద్దు.

భగవంతుడా! నువ్వయినా చెప్పు. నాకు, బాబాకీ మధ్య వీళ్ళెవరు అడ్డంగా నిలబడుతున్నారు. నా ప్రియతముడ్ని తీసుకుపోతున్నారు! నా కళ్ళకి కనబడకుండా చేస్తున్నారు. అన్యాయం! వో భగవంతుడా, నాకేమవుతోంది! నా బాబాని నాకు దూరం చేయకు, అని వొకటే ఏడుపు.

అబ్దుల్లా ఏడుపుని రావ్ సాహెబ్ పట్టించుకోలేరు.

బాబా ఆదేశం మేరకి ఎనీమా చేశాడు.

కడుపు కదిలి ఝాడించి విరోచనమయింది.

ఈ సంగతి బాబాకి చెపితే, ఆయనేమన్నారో తెలుసా?

మానసిక ప్రపంచం నుంచి స్థూల ప్రపంచానికి తీసుకురావటం వల్లనే అబ్దుల్లా తట్టుకోలేక తల్లడిల్లిపోయాడని చెప్పారు. మానసిక ప్రపంచంలో ఎంతో ఆనందంగా వున్నాడు. ఆ స్థితినుంచి దిగి రావాలని లేదు. శరీరం స్పృహ లేదు అతగాడికి. శరీరం ఏమైపోతుందోనన్న బెంగలేదు. కానీ శరీరం మాత్రం అతని మాట వినే స్థితిలో లేదు. ఇంకే మాత్రం ఆటూ పోటూ ఎదురైనా శరీరానికి ముప్పు తప్పదు. అందుకనే ఎనీమా చెయించి అబ్దుల్లాని స్థూల ప్రపంచంలోకి తెప్పించాను మరి.

అతగాడికి ఇది ఇష్టం లేదు.





ఆ దివ్యానుభూతి నుంచి బయటపడాలని లేదు.

ఇందువల్లనే ఏడుస్తున్నాడు అని బాబావారు చెప్పారు.

బ్రహ్మానుభూతిలో తేలిపోతున్న పిల్లలు చాలా మంది శారీరకంగా బాగా శుష్కించారు.

వీళ్ళని తాకకండి అని బాబావారు మండలికి చెప్పారు. వాళ్ళతో మాట్లాడ వద్దన్నారు. అబ్దుల్లా మానసిక పరిస్థితిని వివరించారు. అదృష్టవంతుడీ కుర్రాడు అన్నారు. ఇంకో అడుగు వేస్తే, ఆఖరి మజిలీ చేరతాడు. బ్రహ్మైక్యం లభిస్తుంది వీడికి. కానీ ఆ అదృష్టం అప్పుడే రాదు. సాధారణంగా భగవంతుని సర్కిల్ లోని వారికే బ్రహ్మైక్యం సిద్ధిస్తుంది. అవతారకాలంలో, మరి కొంతమంది అదృష్టవంతులకి కూడా ఆ వరం దొరుకుతుంది. అటువంటి అదృష్టజాతకుల్లో అబ్దుల్లా వొకడు. ఇంకా ఒకళ్ళనో, ఇద్దరినో భగవదైక్య దిశగా నడిపించాలని వారి జన్మ ధన్యం చేయాలనీ వుంది. అబ్దుల్లా అందరిలో నన్ను చూడగలుగుతున్నాడు. కానీ ఇప్పుడప్పుడే భగవత్ సాక్షాత్కారం లభించదు. ఎందుకంటే, రెండు నెలల బట్టి బాగా చిక్కిపోయాడు. శరీరంలో ఏ మాత్రం సత్తువ లేదు. భగవదైక్యం లభిస్తే, ఆ దివ్యానుభూతి వల్ల శరీరం అలసి సొలసి పోతుంది. అంతటి అలసటిని భరించగల స్థితిలో అబ్దుల్లా లేడు. చిన్న కుదుపుకే కుప్పలా కూలి పోయేలా వుంది అతని శరీరం. అందుకనే స్థూల భూమికకి అబ్దుల్లాని దింపాను. మానసిక ప్రపంచం నుంచి క్రిందకు తీసుకు రావటం చాలా కష్టం. ఇది ఎంత కష్టమో అతగాడు శారీరకంగా పడుతున్న బాధలను మీరే చూశారు. ఒక రోజా, రెండు రోజులా, ఆరు రోజులుగా తల్లడిల్లి పోతున్నాడు.

ఇంకొక మాట. పరాత్పరుని దర్శన భాగ్యం కలిగాక సాధారణ చైతన్యం పూర్తిగా తిరిగి పొందాలంటే ఆషామాషీ పని కాదు.

మజూబ్‌లకే ఇది సాధ్యం.

సాలిక్‌లకీ చివరకు సద్గురువులకి కూడా కష్టమే ఇది.

అందుకనే అబ్దుల్లా అదృష్టవంతుడయ్యాడు.

మీకో సంగతి చెప్పనా,

వీడికీ, మరో ఇద్దరికీ నా సర్కిల్ సభ్యులతో పాటు భగవత్ సాక్షాత్కార భాగ్యం కల్గిస్తాను. వెంటనే వాళ్ళతోపాటు వీళ్ళకీ స్థూల భూమికకి తీసుకువస్తాను. మరి అప్పటి వరకూ అబ్దుల్లా ఏం చేయాలి. అసలు ఏం చేయాలి

కనుక వాడు. దివ్య దృష్టి దొరికింది. పూజార్హుడు అయ్యాడు. యోగులు పూజించి తరించగలంత సమర్థుడయ్యాడు. ఈ పూజ వల్ల అబ్దుల్లాకి హాని జరగదు.

అతడు బంధవిముక్తుడు. ఈ శరీరం వదిలితే, జనన, మరణాల వలయం నుంచి బయట పడితాడు. నాలో శాశ్వతంగా వుంటాడు. బ్రతికితే ఇంకేముంది గొప్ప అదృష్టవంతుడవుతాడు. బ్రహ్మైక్య వరం సిద్ధిస్తుంది. ఇస్లామ్ మతస్థుడు కాబట్టి మహమ్మదీయుల పాలిటి కల్పతరువు అవుతాడు.

అరేబియాలో నా ప్రత్యేక ప్రతినిధిగా వెలిగిపోతాడు.

(అబ్దుల్లా అంటే భగవంతుని సేవకుడు అని అర్థం. పరిష్యా- ఇప్పటి ఇరాన్ నుంచి బాబా దగ్గరకి వచ్చాడు. బాబా దగ్గరకి రావటానికి ముందు కొంతకాలం అరేబియాలో వున్నాడు).

ప్రభువుకి కష్టం అయిన పనిలేదు.

ఐనా, ఉన్నత భూమికల్లోని వ్యక్తిని దింపడం చాలా ప్రయాస పడాల్సి వస్తోంది. ఎందుకో తెలుసా? పరాత్పర దర్శనం కోసం మనస్సు అంతర్ముఖంకాగానే, రక్త పోటు పెరుగుతుంది. మాములుగా రక్త ప్రసరణ గుండె నుంచి క్రింద శరీర భాగాలకి జరుగుతుంది.

రక్త పోటు ఒక్కసారి పెరగానే, రక్త ప్రసరణ దిశను మార్చాలి. ఒక విధంగా చెప్పాలంటే ప్రకృతికి విరుద్ధంగా పని చేయాల్సి వస్తుంది.

అందుకనే ఉన్నత భూమికలకి చేరిన వ్యక్తిని క్రిందకు తీసుకురావటం చాలా శ్రమతో కూడిన పని అవుతుంది అని బాబావారు మండలికి వివరించారు.

అప్పట్లో, ఓ సంగీత ఝరి ఏర్పాటు చేశారు.

సంగీతం అబ్దుల్లాకు ఇప్పుడు సరిపడదు అని బాబా చెప్పారు.

పాట వినగానే మరింత తన్మయంలో పడిపోగలడు. ఆ తన్మయంలో కన్నీరు మున్నీరుగా ఏడ్వవచ్చు. ఒక్కసారి అలా జరిగితే కన్నీటి ధారలు ఆగవు. ప్రాణాలు పోయినా పోవచ్చు అని పేర్కొన్నారు.

సంగీత కార్యక్రమాన్ని రద్దు చేశారు.

జనవరి25న బాబావారు తమ గొయ్యిగదిలో అబ్దుల్లా కోసం కొంత జాగా కేటాయించారు.

అక్కడ కర్టెన్ పెట్టించారు.





బహుశా తమ విశ్వకార్యక్రమ ప్రభావం నుంచి అబ్దుల్లాని దూరంగా వుంచాలనుకొన్నారో ఏమో, తమకీ అబ్దుల్లానే తెర పట్టారు. అయితేనేం, ఎందరికి దొరుకుతుందీ భాగ్యం. అవతారుని పంచన వుండటమేకాదు, అవతారుడు తనకంటూ కట్టుకొన్న సమాధి గదిలో వుండగలగటం ఎంత అదృష్టమో కదూ! బాబా చలవ వల్ల ఆరవ భూమికకి చేరి, భగవంతుని చూడగలుగుతున్న చోటా బాబాకి ఇదంతా పట్టిందో లేదో తెలియదు. ఆవేళ్టి నుంచి మాత్రం గొయ్యిగదిలో పడుకోసాగాడు. రాత్రీ, పగలు, అక్కడే వుంటున్నాడు. అతనికి తోడు బాబానే.

దరిమిలా కొద్ది రోజులు పోయాక, రాజారామ్‌ని, లోభాజీనీ కూడా బాబావారు గొయ్యిగదిలో కూర్చోనిచ్చారు.

అదీ పగలు మాత్రమే.

జనవరి 26వ తేదీన బాబావారు బువా సాహెబ్‌నీ, రావ్‌సాహెబ్‌నీ పిలిచారు. వారికో పని అప్పగించారు.

ఇంతకీ ఏమిటీ పని అంటే, వో ఇరవై మంది పిల్లల్ని తమ దగ్గర వుంచుకోవాలను కొంటున్నారట. మంచి నడవడిక, ఆధ్యాత్మిక దృక్పథం, బాబా వారంటే నిజమైన ప్రేమ వున్న ఇరవై మందిని సెలక్టు చేయమన్నారు.

సరే, రావ్ సాహెబ్, బువా సాహెబ్ వెంటనే ఇరవై పేర్లు వ్రాసి ఇచ్చారు.

వీరందరూ రోజూ కాసేపు నా దగ్గరే వుంటారని బాబా చెప్పారు.

వాళ్ళ బసని వాటర్ ట్యాంకి గది (మూడవ హాలు)కి మార్చమన్నారు. రావ్ సాహెబ్ కూడా పిల్లలతో పాటు తమ దగ్గర కూర్చోమన్నారు.

ఒకటి రెండు రోజుల తర్వాత అనుకొంటా ఏమయిందీ అంటే, రాజారామ్‌కి ఎటుచూసినా బాబా భౌతిక రూపంలో కనిపించారు.

అంతే అతను ఆనంద లోకాలకి వెళ్ళిపోయాడు.

వసంత్‌కి ఏమయిందో తెలియదు. గంటల తరబడి ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాడు. అతన్ని వోదార్చ గలిగింది బాబా వారొక్కరే.

మరి మిగిలిన పిల్లల సంగతి ఏమయింది? వాళ్ళని బాబావారు ఎప్పటిలా స్కూలుకి వెళ్ళమన్నారు. చదువుకోడానికీ, ఆడుకోడానికీ, ధ్యానానికీ రోజూ కొంత టైమ్ కేటాయించాలి. ధ్యానం మానకూడదు ఎప్పుడూ. చాలా స్ట్రిక్ట్‌గా వుండాలి చదువు విషయంలో ఏ మాత్రం బద్ధగించినా దండించండి", అని బాబా శెలవిచ్చారు.

జనవరి 27వ తేదీన, బాబా దర్శనానికి వో కుర్రాడువచ్చాడు.

అతనిది జొరాస్ట్రియన్ మతం. పేరు కైఖుస్రు జె. ప్లీడరు.

ఉపాసినీ మహారాజ్ జీవిత చరిత్ర చదివాడట.

అంతే మనస్సు భగవంతుడి పైకి మళ్ళింది. బాబా.. మీ దగ్గరే వుంటానన్నాడు.

మెహెరాబాద్‌లో వుండనీయమన్నాడు.

అయితే బాబా వొప్పుకోలేదు.

ఇంటికి పంపించేసారు.

దరిమిలా చాలా రోజుల తర్వాత ఇతగాడు బాబా దగ్గరకి వచ్చాడు. సేవించి తరించాడు.

బాబా చరిత్రలో ప్లీడర్‌గా చిరపరిచితమైన వ్యక్తి ఇతనే.

ఆరోజు (27వ తేదీ) మధ్యాహ్నం, రుస్తం, పాద్రి, చాన్జీలని బాబా తమ క్యాబిన్‌కి రమ్మన్నారు మధ్యాహ్నం మూడింటికి.

మీరు రావాలి అని కబురు పెట్టారు. వారు ముగ్గురూ చెప్పిన టైమ్‌కి వచ్చారు. వాళ్ళని తమ క్యాబిన్ (గొయ్యిగది) లోకి తీసుకు వెళ్ళారు.

రావ్ సాహెబ్ , బువాసాహెబ్‌లనూ లోనికి రమ్మన్నారు. లోపల ఇంకొకరున్నారు అప్పటికే. అతనెవరో వూహించగలరా పాఠక మహాశయా. అతనెవరో కాదు మన చట్టిబాబా. అదే అబ్దుల్లా .

జనవరి 25వ తేదీనుంచి అబ్దుల్లా గొయ్యిగది తెర వెనుక వుంటున్నాడు కదా!

రుస్తుం, పాద్రీ, ఛాన్జీ, రావ్ సాహెబ్, బువాసాహెబ్‌లతో బాబా కాసేపు మాట్లాడారు ఏమి మాట్లాడారు? అది రహస్యం,

ఆ సంగతులను బయటపెట్టలేదు. సరే, వీళ్ళతో మాట్లాడటం అయ్యాక అబ్దుల్లాని పిలిచారు. తెర తప్పించుకుని వచ్చాడు. నా ప్రక్కన కూర్చోమన్నారు. బాబా చెప్పినట్లే చేశాడతడు. వెంటనే ప్రశ్నల వర్షం కురిపించారు. ఆరవ భూమిక అనుభూతిని ప్రసాదించాక, ఛోటా బాబాని బాబా ఇలా ఎప్పుడూ ప్రశ్నించలేదు.

బాబా : నీకు మనస్సు వుందా?

అబ్దుల్లా : లేదు! పోయింది.

బాబా : తాత్కాలికంగానా?

అబ్దుల్లా : కాదు, శాశ్వతంగానే

బాబా : కోరికలున్నాయా!

అబ్దుల్లా : వుహూ! లేనే లేవు.

బాబా : నన్ను ప్రతి చోటా చూస్తున్నావా?

అబ్దుల్లా : ప్రతి చోటా! చిన్న రేణువులో కూడా.

బాబా : శరీరంలో ఎక్కడైన నెప్పి వుందా?
ఆనందం అనుభవించగలుగుతున్నావా,

అబ్దుల్లా : లేదు. శరీరం స్పృహ లేదు నాకు.

బాబా : ఇంకేమయినా చూడగలవా?





అబ్దుల్లా : శ్రీ (బాబా) తప్ప చూడటానికి ఏముంది?

బాబా : ఒంటరిగా వదిలేస్తే, ఎక్కడికి పోతావు?

అబ్దుల్లా : నేను వెళ్ళాల్సి వస్తే, ఎక్కడికయినా వెడతాను.
ఎక్కడికి వెళ్ళినా శ్రీ (బాబా) తోనే వుంటాను.

బాబా : ఇక్కడ నడుస్తున్నప్పుడు, నీకేమైనా అనిపిస్తోందా?
ఇటు వస్తున్నా, అటు పోతున్నా, నీ గది నుంచి ఇక్కడికి వస్తున్నా ఏమనిపిస్తోంది.

అబ్దుల్లా : నాకేమీ అనిపించటం లేదు. అంతా యాంత్రికంగా జరిగిపోతోంది.

అబ్దుల్లా మాటలు వింటున్న వారికి వో ధర్మ సందేహం వచ్చింది. ఈ కుర్రాడు మనస్సు లేదు అంటున్నాడు కదా. మరి అడిగిన ప్రశ్నకి జవాబు ఎలా ఇస్తున్నాడు.

ఈ శరీరం వున్నా, పోయినా వొక్కటే నాకేమీ పట్టదు.

నిద్రపోతున్నా మెళుకువగా వున్నా నువ్వు కనిపిస్తున్నావ్.

బాబా : ఎప్పుడూనా?

అబ్దుల్లా : ఆ! ఎప్పుడూ! క్షణం క్షణం, అనుక్షణం

బాబా : ఎంతకాలం చూస్తావ్ నన్ను?

అబ్దుల్లా : ఎప్పటికీ!

బాబా : సంతోషంగా వుందా?

అబ్దుల్లా : ఆ! బ్రహ్మాండంగా! అంతుపట్టనంత అవధులులేని ఆనందంగా
వుంది నాకు

బాబా : ఇలా ఎన్నాళ్ళు

అబ్దుల్లా : నువ్వు వున్నంతకాలం. నువ్వు ఎక్కడ వుంటే,
నేను అక్కడే వుంటాను. నీతోనే వుంటాను.
ఎందుకంటే నిన్నే చూస్తున్నాను.
ఇరవై నాలుగు గంటలు ఇంకేమీ చూడటంలేదు.
ఎలా చదవ గలుగుతున్నాడు.
పాయఖానాకి వెళ్ళాల్సి వస్తే ఎలా వెడుతున్నాడు అనుకొన్నాడు.
మనస్సులో మాట బాబాతో చెప్పాడు.

బాబా వారు ఏమి బదులు చెప్పారో తెలుసా?

అబ్దుల్లాలోని నేను చేస్తున్నా, ఆ పనులన్నీ అన్నారు. ఈ మాటల ఆంతర్యం అర్థమయిందో లేదో అనిపించినట్లుంది. మరికొంత వివరణ ఇచ్చారు.

అబ్దుల్లాకి మనస్సులేదు.

అందుకనే కోరికలు లేవు.

పలకరిస్తే పలుకుతాడు తప్ప తనంత తానుగా పెదవి కదపడు. శరీరం వుంది. కానీ శరీరం స్పృహలేదు. నిద్ర లేకుండా రాత్రి పగలు కూర్చోమన్నా కూర్చొంటాడు. అయినా అతనికి ఏమీ పట్టదు. నేను అలా కూర్చుంటే నేను అయినా అలసి పోతాను. అబ్దుల్లాకి ఏమీ కాదు. ఎందుకూ అంటే, శరీరం స్పృహ లేదు. ఈ శరీరం కావాలన్న కోరికా లేదు వాడికి, వెయ్యి మంది వచ్చి ముందు కూర్చొన్నా ఏమీ కాదు. ఒంటరిగా గదిలో కూర్చోపెట్టినా పట్టించుకోడు. అబ్దుల్లా అందరిలాంటి వాడు కాదు. అతనివంటి పిల్లలు ఇక్కడ లేరు. బ్రతికుంటే, నాకు బాగా సాయపడగలడు, అని బాబా చెప్పారు. అబ్దుల్లాని ముద్దాడారు. తెరవెనుక వైపున కూర్చోపెట్టారు.

అబ్దుల్లా ఏ మాత్రం స్పందించలేదు.

బాబావారీ సంగతిని ప్రస్తావించి, ఈ ప్రక్క నుంచి, ఆ ప్రక్కకి మార్చినా అబ్దుల్లాపై ఏ మాత్రం ప్రభావం పడలేదు.

ఎందుకు అంటే, అబ్దుల్లా ఈ శరీరం అబ్దుల్లాది కాదు.

మనస్సు కాదు. ఆత్మలకెల్ల ఆత్మని చూస్తున్నాడు ఆధ్యాత్మికంగా చెప్పాలంటే అతను నిర్వాణం పొందాడు.

ఇదే ఫనా స్థితి.

ఫనా రెండు రకాలు. ఒకటి చైతన్యంతో కూడిన దశ.

రెండవది అచైతన్య దశ.

ఈ స్థితిలో నన్ను మాత్రమే చూస్తాడు.

ఇంకేమీ కనబడదు.

మరేమీ పట్టదు.

శరీరం స్పృహ వుండదు.

భగవంతుని ప్రతి చోటా చూసే మజబ్‌ల దశయిది. బ్రహ్మైక్యం పొందిన మజూబ్‌ల స్థితి మరో రకంగా వుంటుంది. వాళ్ళకి ప్రతి చోటా ఆత్మ కన్పిస్తుంది.

అబ్దుల్లా స్థితి, రాజారామ్ స్థితి వొకటి కాదు.

రెండు వేర్వేరు. రాజారామ్ స్థితి అచేతనావస్థ. శారీరక ప్రాపంచిక స్పృహ వుంది. మనస్సు పని చేస్తోంది. కాబట్టి నూర్ (దైవీ కాంతి)లో మునిగి పోయినా, కొన్నిసార్లు మనస్సు క్రిందికి లాగుతుంది. ప్రాపంచిక విషయాల పైకి దృష్టిని పెట్టమంటుంది. అప్పుడు అతనికి దైవీ కాంతి కనబడదు.

ప్రాపంచిక విషయాల నుంచి మనస్సు మళ్ళగానే, దైవీ కాంతి, నూర్, దర్శనమిస్తుంది.

ఫనా రెండవ దశ అబ్దుల్లాది. ఈ దశలో మనస్సు పూర్తిగా నాశనమవుతుంది. కోరికలు వుండనే వుండవు. వస్తువుల నిజరూపం కనిపిస్తుంది.

ఐతే దైవీ కాంతి, నూర్, బాబాగానే చూస్తాడు.





ఈ స్థితి సాలిక్‌ల వంటిది.

తేడా అల్లా ఏమిటీ అంటే సాలిక్‌ల మాదిరిగా చూడగలగటమే.

వారిలా పరమాత్మానుభూతి దొరకదు. అందరిలా భగవంతుని చూస్తాడు.

బహ్మైక్యం సిద్ధించిన సాలికలు అన్నింటా తమ ఆత్మనే చూస్తారు.

ఇలానే బఖా దశలో రెండు రకాలు- చైతన్యం, అ చైతన్యావస్థలు అని రెండు రకాలు.

బ్రహ్మైక్యానుభూతిలోనే వుండిపోయిన దశ బఖా అని చెప్పవచ్చు.

మజూబ్‌ల మాదిరి అచైతన్యం, సాలిక్‌లవంటి చైతన్యం వీరి సొత్తు.

పరాత్పరుని చూడటమే కాదు,

అన్నింటికి మూలమైన పరమాత్మతో కలిసి పోతాడు.

ఇప్పటిలా వుంటే, అబ్దుల్లా వచ్చే రెండు నెలల్లో శరీరం వదిలిపెట్టే ప్రమాదం వుంది.

నేనా కుర్రాడిని కాపాడవచ్చును. కానీ, ఆధ్యాత్మికంగా ఎవరినైనా ముందుకు త్రోశాక, నేను కలగజేసుకోను.

ఐతే, భౌతికంగా తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఈ పని అబ్దుల్లా శరీరం విషయంలోనూ చేస్తున్నాను అని బాబా తెలియజేశారు.

జనవరి 28వ తేదీన హజరత్ బాబాజాన్ జన్మదినం ఘనంగా జరిపారు. ఆ వేళ స్కూలు పిల్లలకి ఆటవిడుపు ఇచ్చారు.

వాళ్ళు ఆటపాటల్లో తేలిపోయారు.

మర్నాడు ఉదయాన్నే షిరీన్ మాయి వచ్చింది.

చిన్న ఆదీ ఒంటిలో బాగోలేదని విన్నది.

తల్లి మనసు కదా. వుండబట్టలేక మెహెరాబాద్‌కి వచ్చింది. బాబాతో చాలాసేపు మాట్లాడింది.

నువ్వు ఎలానూ పెళ్ళి చేసుకోనన్నావ్.

కనీసం బెహ్రంని కానీ, జాల్‌ని కానీ వాపసు పంపు.

పెళ్ళి చేస్తే మా దగ్గరే వుండి మా ఆలనా పాలనా చూస్తారు. నేనూ మీ నాన్న పెద్ద వాళ్ళమయిపోతున్నాము అని ఎన్నో రకాలుగా చెప్పింది.

తల్లి మాటలకి బాబా ఎదురు చెప్పలేదు.

శ్రద్ధగా విన్నారు తప్ప ఔననలేదు, కాదనలేదు,

హతాశురాలైన షిరీన్‌మాయి సాయంకాలం పూనా బండి ఎక్కింది.

తల్లి వెళ్ళిన కాసేపటికి, రమాజీ ఏడుస్తూ వచ్చాడు.

బాబా! ఏదో కొద్దో గొప్ప వెలుతురుగా దర్శనమిస్తున్నావ్ ఇన్ని రోజులు. ఈ వేళ

ఆ కాంతి మాయమయింది.

నేనేం చేశానని నాకీ శిక్ష వేశావు బాబా అంటూ వలవలా ఏడ్చేశాడు.

బాబా సముదాయించారు రమాజీని.

తన ఒడిలో పడుకోబెట్టి ముద్దాడారు.

నుదిటిపై తన వ్రేళ్ళు వుంచి, 'ఇప్పుడు మళ్ళీ కన్పిస్తోందా? అని ప్రశ్నించారు.

ఆ! ఆ! బాబా! కనిపిస్తోంది మళ్లీ అంటూ రమాజీ ఆనందంతో వుక్కిరి బిక్కిరి అయ్యాడు.

ముడోకన్ను కొంచెం కొంచెం తెరుచుకొంటోంది.

అందుకనే ఆ దివ్యానుభూతి కలుగుతోంది అని బాబా పేర్కొన్నారు.

ఆఘా ఆలీ అంటే కూడా బాబాకి ఎంతో ఇష్టం. ప్రేమాశ్రంలో వుంటున్న ఈ కుర్రాడికి బాబా దివ్యత్వం కొంచెం కొంచెంగా చవి చూస్తున్నాడు.

బాబా దగ్గరే వుండాలన్నది అతగాడి కోర్కె.

కానీ జనవరి రెండవ వారం నుంచీ బాబా వారికి దూరంగా వుంటున్నారు.

ఒకవేళ ఎప్పుడయినా దగ్గరకి తీసుకొన్నా ఆ ముచ్చట కాస్సేపే. నిమషం కాకుండానే పంపేస్తున్నారు.

పాపం ఆఘా ఆలీకి బాబా ఆంతర్యం అంతుబట్టలేదు.

పైగా పుట్టెడు దుఃఖం తరుముకు వచ్చింది.

బాధతో కుమిలిపోయాడు

ఒకసారి బాబా వారు ఏం చేసారు.

ఆలీని పిలిచారు. ఆ కుర్రాడు పరుగెత్తుకు వచ్చాడు.

వో క్షణం కూడా కాకుండానే పంపేశారు.

ఇలా మొత్తం పదిసార్లు చేశారు.

ఆలీ ఎంతో ఆశతో రావటం, బాబా ఏదో వొంకని వాడిని వెంటనే పంపేయటం చూసే వాళ్ళకే- అయ్యో, అనిపించింది.

అప్పుడు బాబా ఏమన్నారో తెలుసా?

దైవోన్మత్తతలో కూడా శిరస్సు ప్రభువు పాదాల దగ్గరే వుండాలి అన్నారు. భగవోన్మత్తత వొక్కటే సరిపోదు. ప్రభువుకి అంకితం కావాలి. సర్వార్పణ చేయాలి. అప్పుడే పరాత్పరుడు కనికరించేది. మార్గం చూపేది.

జనవరి 29వ తేదీన బాబావారు కనికరించారు.

ఇప్పుడు ఆలీ నా స్పర్శకి అర్హుడు అన్నారు.

కానీ మర్నాటి సాయంత్రం నలుగురు పిల్లల ముందూ ఆలీని విమర్శించారు

ఈ మధ్య చదువు ధ్యాస బాగా పట్టింది.





నన్ను మరచి పోయాడు.

అస్తమానం నాన్న ధ్యాసే వాడిది. నాన్నని ఎప్పుడు కలుద్దామా అని ఎదురు చూస్తున్నాడు.

పాపం! ఆలీ! బాబా మాటలు విని తట్టుకోలేక పోయాడు. దుఃఖం పొంగి వచ్చింది. బాబా ఎదురుగా నిలబడలేక పరుగెత్తాడు. ఎక్కడికి పోతున్నాడు? వో గమ్యం లేదు. వెంటనే పారి పోవాలనిపించింది. కాళ్ళకి పని చెప్పాడు.

రావ్ సాహెబ్‌ని బాబా వా వెనక పంపారు. ఆ పెద్దాయన ఆలీని పట్టుకొని బాబా దగ్గరకి తెచ్చాడు. బాబా వాడిని తన చేతుల్లోకి తీసుకొని ముద్దాడారు. ఏడ్వవద్దని హితవు పలికారు.

ఐనా ఆలీ దుఃఖం ఆగలేదు చాలాసేపు.

చాలాసేపు అంటే ఎంతసేపు? మూడు గంటల సేపు.

బాబా అక్కున చేర్చుకొని వీపుతట్టి, నుదిటిపై ముద్దాడారు. తమ శిరస్సు వాడి ి చాతీపై రెండు మూడుసార్లుంచారు.

అంతే వాడి ఏడుపు ఆగిపోయింది. కాస్తంత స్థిమితపడినట్లు కన్పిస్తునే మూర్చపోయాడు

పదిహేను నిమషాలు అలానే వున్నాడు.

రావ్ సాహెబ్ ఎంతగా కుదిపినా వీడిలో కదిలిక రాలేదు. కళ్ళు తెరవ లేదు. రెప్పలు ఎత్తితే, కనుపాపలో జీవం కనబడలేదు.

రావ్‌సాహెబ్ ఎంతగా పిలిచినా పలకలేదు.

కాసేపు నిశ్శబ్దం తాండవించింది. ఇప్పుడు అడుగు అంటూ బాబావారు రావ్ సాహెబ్‌కి సంజ్ఞ చేశారు.

వెంటనే 'ఎలా వున్నావ్ ఆలీ', అని ఆయన అడిగాడు.

'సంతోషంగా వున్నాను', అన్నాడు ఆలీ.

వినపడీ వినపడనట్లుంది ఆలీ మాట.

ఎక్కడో సుదూర తీరాలనుంచి మాట్లాడుతున్నట్లు వుంది.

రావ్ సాహెబ్ : నువ్వు ఏం చూస్తున్నావ్?

ఆలీ: బాబా

రావ్ సాహెబ్ : ఎక్కడ

ఆలీ: ప్రతిచోటా!

బాబా ఆజ్ఞ మేరకి ఆలీని ఆస్పత్రికి తీసుకువెళ్ళి మందు ఇప్పించారు. వాడికి ఏ లోటూ రాకుండా పాద్రి ఏర్పాట్లు చేశాడు. ఆ రాత్రి అంతా మండలి వారు ఎవరో ఒకరు ఆలీ మంచం ప్రక్కనే జాగారణ చేశారు. అక్కడ గొయ్యి గదిలో పై అరుగుపైన రాత్రి

రెండింటి వరకూ బాబా కుర్చొనే వున్నారు.

ఆలీ ఆరోగ్యం గురించి తరచు అడిగారు.

ఉదయానికి, ఆలీ పరిస్థితి మెరుగైంది.

కాస్తంత లేచి నిలబడగలిగాడు.

ఆస్పత్రి గదిలో అటూ ఇటూ నడిచాడు.

అలా అని మామూలు మనిషి అయ్యాడు అనడానికి లేదు.

కళ్ళలో జీవం లేదు. ఎటో శూన్యంలోకి చూస్తునట్లున్నాయి.

ఆ జనవరి 29వ తేదీ రాత్రి ఆలీ కోసం బాబా ఎంతగా కష్టపడ్డారో?

భగవదన్మత్తుడిని మామూలు స్థాయికి తీసుకురావటం ఎంత కష్టమో వూహించ లేరు ఎవరూ.

31వ తేదీన బాబావారు తమ గొయ్యి కిటికి దగ్గరకి కూడా రాలేదు. కిటికీ దగ్గర కూర్చొని బాబా పిల్లలకి ఆధ్యాత్మిక పాఠాలు చెప్పేవారని పాఠకులకు తెలుసు కదా.

ఆ వేళ బాబా తమ గదిలోనే వుండి పోయారు. రావ్ సాహెబ్ ఆస్పత్రిలో ఆలీ దగ్గర వున్నాడు. స్కూలు బాధ్యతని రుస్తుం తన భుజాలపై వేసుకొన్నాడు ఆవేళ.

ఆస్పత్రిలో మూడురోజులున్నారు ఆలీ.

కొంత స్వస్థత చేకూరింది.

బాబాకి తన గోడు వినిపించాడు.

“బాబా నాకు మాట్లాడే శక్తిని ప్రసాదించు. ప్రతి చోటా నిన్నే చూస్తున్నానని ప్రపంచానికి చాటి చెప్తాను. ఇప్పుడు, అప్పుడు అని లేదు ఎల్లెప్పుడూ నిన్నే దర్శిస్తున్నానని ఘంటాపధంగా చెప్తాను” అన్నాడు.

బాబావారు చిరునవ్వు నవ్వారు.

వీపు తట్టారు.

రేపటి నుంచి స్కూలుకి వెళ్ళు అన్నారు.

ఆలీ బాబా ఆజ్ఞ ప్రకారం మర్నాడు అంటే ఫిబ్రవరి ఒకటి నుంచి చదువుపై దృష్టి పెట్టాడు.

బాబా దివ్యత్వాన్ని చూశాడీ కుర్రాడు.

ఆ మాటే చెప్తానన్నాడు ప్రపంచానికి. అయినా నమ్మేదెవరు బాలుడి మాట!

ఈ సంఘటన జరిగిన రెండు రోజులకి అంటే ఫిబ్రవరి 2వ తేదీన కె.జె.దస్తూర్ మెహెరాబాద్‌కి వాపసు వచ్చాడు.

స్కూల్లో రోజూ రెండు గంటల పాఠాలు చెప్పమన్నారు.

సరేనన్నాడు, కానీ ఏమయిందో తెలీయదు నాల్గింటికి క్రిందపడి దొర్లటం మొదలెట్టాడు. ***(సశేషం)***





# మెహెర్‌బాబా 116వ జన్మదినోత్సవాలు

## రాజమండ్రి సెంటర్‌లో

అవతార్ మెహెర్‌బాబా వారి 116వ జన్మదినోత్సవ వేడుకలు 25.02.2010న రాజమండ్రి సెంటర్‌లో ఘనంగా ఏర్పాటు చేసినట్లు కె.మహేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 25న రక్తదాన శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

## కరీంనగర్‌లో

అవతార్ మెహెర్‌బాబా వారి 116వ జన్మదినోత్సవ సందర్భంగా కరీంనగరం తెట్టగుంట అగ్రహారం, సిరిసిల్లా, చంద్రంపేట, నేరెళ్ళ సెంటర్లలో అమిత వుత్సాహంతో మెహెర్‌బాబా వారి జన్మదినోత్సవములు జరుపబడినది, పైన తెలుపబడిన సెంటర్లలో రమణ, ఆర్.టి.సి హైదరాబాద్ హాజరై తన ప్రేమగానంతో ప్రేమికులను అలరింపజేసారు.

## శ్రీ వంకాయల నిర్యాణం

శ్రీ వంకాయల సురేష్ (35) శ్రీకాకుళం బాబా నామస్మరణలో అకస్మాత్తుగా 232.2010న తుదిశ్వాస విడిచారు. వీరి కోరిక మేరకు ఆయనగారి రెండుకళ్ళను స్థానిక నేత్రవైద్యాలానికి దానమిచ్చినట్లు, శ్రీ ఎమ్.వి.కామయ్య శెట్టి తెలిపారు. శ్రీ కామయ్య శెట్టి గారి రెండవ కుమార్తె భర్త– శ్రీ వంకాయల సురేష్ అకాలమరణం పట్ల స్థానిక బాబా ప్రేమికులు దిగ్భ్రాంతి, సంతాపం తెలిజేశారు.

## కన్‌కల్ సెంటర్ 29వ వార్షికోత్సవము

అవతార్ మెహెర్‌బాబా కన్‌కల్ సెంటర్ 29వ వార్షికోత్సవము ఆదివారం 14.03.2010న ఉ. 7 గంటల నుండి ఏర్పాటు చేసినట్లు ఈ కార్యక్రమంలో బాబా ప్రేమికలు శ్రీ మెహెర్ ప్రసాద్‌రాజు, శ్రీ బి. రామకృష్ణయ్య పాల్గొంటున్నట్లు ఆహ్వానం పంపారు.

## నివగాం

ప్రియతముని 116వ జన్మదినోత్సవాలను నివగాం సెంటర్‌లో ఘనంగా జరుపుకున్నామని కార్యదర్శి శ్రీ పి. వెంకటరావు తెలిపారు.

## పాలకొండ

ప్రియతముని 116వ జన్మదినోత్సవాలను పాలకొండ సెంటర్‌లో ఘనంగా జరుపుకున్నామని కార్యదర్శి తెలిపారు.

## చల్లపల్లి, కృష్ణాజిల్లా

01.02.2010 నుండి 25.02.2010 వరకు మా సెంటరునందు, వివిధ ప్రేమికుల గృహములందు అవతార్ మెహెర్‌బాబా జన్మదిన వేడుకలు వైభవముగా జరిగినవి. మా కార్యక్రమములందు "Beloved Baba" Editor Mallikharjuna Rao (Hyderabad), Balagopala Bhaskara Raju (T.P.Gudem), K. Venukumari-(Eluru), U.Bapiraju (Eluru), Bh. Kesava Rao- (Vijayawada), B.V.Subba Rao, (Guntur) Dr. Viswanadham, (Chirala), K.Madhuri Latha (Vizag) మా కార్యక్రమములందు పాల్గొని చక్కటి సందేశములను అందించిరి. మా సెంటరు నుండి K. Sulochana, S. Sumithra, Bh.Balasita devi, Ch. N.V.Sitharamaiah, Ch. Meher Rani గారలు కూడా ప్రసంగించిరి. ఆదివారములందు నగర సంకీర్తన నగర మందలి పలు ప్రాంతములందు చేసితిమి. 25.02.2010 నాడు ఉదయం 4 గంటలకు సంకీర్తనతో ప్రారంభించి 5 గంటలకు అవతారుని జనన సమయమున హారతి, ప్రార్ధనలు, ప్రసంగములు 7 గంటల వరకు జరిగి ప్రసాదవితరణతో ఉదయం కార్యక్రమము ముగిసినది.

## తాడేపల్లిగూడెం

ప్రియతముని 116వ జన్మదినోత్సవ ప్రత్యేక కార్యక్రమములు జనవరి 1వ తేదీ నుండి మొదలు పెట్టి ఫిబ్రవరి 25వ తేదీ వరకు మొత్తం 56 రోజులు వివిధ ప్రేమికుల గృహములందు బాబా జన్మదినోత్సవ కార్యక్రమాలు నిర్వహించితిమి. జనవరి 31 అమరతిథి నాడు అలాగే ఫిబ్రవరి 12 శివరాత్రి రోజున ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించితిమి. శ్రీ శ్రీనిబాబా చెన్నై ప్రత్యేక అతిధులుగా విచ్చేసి వీడియో రికార్డింగ్ చేశారు. ఫిబ్రవరి 25న తెల్లవారుఝామున బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో చేతిలో క్యాండిల్స్ వెలిగించుకుని సెంటర్‌కు విచ్చేసారు. బాబా జననకాల సమయంలో బాబాకు ఆరతి ఇచ్చి ప్రార్ధనలు చేశారు. స్థానిక ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ శ్రీ బోగలిల్లి రాజా దంపతులు బర్త్‌డే కేక్ కట్ చేశారు. బాబా చిత్రపటంతో పురవీధుల్లో ఊరేగింపు జరిపాం.

***-డా॥ వై. విజయసారధి***

# పెరికీడు

అవతార్ మెహెర్‌బాబా 116వ జన్మదిన వేడుకలు పెరికీడు సెంటరులో 14.2.2010 నుండి ప్రారంభమై 25.2.2010 వరకు జయప్రదంగా నిర్వహించబడ్డాయి. సో॥ జి.యస్.ప్రకాష్, శ్రీకాకుళం, శ్రీమతి వేణుకుమారి (ఏలూరు), శ్రీ రెడ్డి సింహాచలం, శ్రీమతి గిరిజారాణి, శ్రీ వేంద్రపు వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# మెహెర్‌బాబా 116వ జన్మదినోత్సవాలు

## ముటుకూరు సెంటర్

మెహెర్‌బాబా ముటుకూరు సెంటరు నిర్మాణము పూర్తయ్యింది. ఇంకా రంగులు, కరెంటు, ఫ్లోరింగ్ మిగిలిన చిన్నపాటట పనులు చేపటలి. ఉదార స్వభావముతో బాబా భక్తులు విరాళాలు ఇచ్చి మెహెర్‌బాబా ప్రేమాశీస్సులు పొందగలరని ఆశిస్తున్నామని ***యాగంటి సుబ్బయ్య, ట్రజరర్, ఒక ప్రకటనలో తెలిపారు.*** ఇందుకు Online Account No.11546058867, SBI దుర్గి బ్రాంచి అని పేర్కొన్నారు.

## ఖమ్మం సెంటర్

అవతార్ మెహెర్‌బాబా 116వ జన్మదినోత్సవములు ఖమ్మం సెంటరు ఆధ్వర్యములో వైభవంగా జరిగాయి. 4.2.2010 నుండి 24.2.2010 వరకు ప్రతిరోజు ప్రేమికుల గృహములలో భజనలు, ఉపన్యాసములు జరిగినవి.

25.02.2010 కార్యక్రమములో ఉ॥ 4 గంటలకు నగర సంకీర్తనతో ప్రారంభమయినది. 5 గంటలకు అవతారుని జనన సమయములో ఏడుసార్లు జై జై లు చెప్పబడి, ప్రార్ధనలు, హారతి ఇవ్వబడినది. 7.30 కు సప్తవర్ణ పతాకావిష్కరణ జరిగి పతాక విశిష్టతను శ్రీ రామచంద్రయ్య గారు వివరించిరి. 8 గంటల నుండి ఈశ్వరాంబ వృద్ధాశ్రమము, జీవన సంధ్య వృద్ధాశ్రమము, ఆర్య వైశ్య వృద్ధాశ్రమములలో పండ్లు, స్వీట్లు ఇవ్వబడినవి. మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల ఆశ్రమములో (50) మందికి స్వీట్లు, పండ్లతో పాటు, భోజనము కూడా బాబా ప్రసాదముగా ఇవ్వబడినది. ఈ కార్యక్రమమునకు ప్రత్యేక ఆహ్వానితునిగా విచ్చేసిన శ్రీ క్రిష్ణ ప్రసాదు, (హైదరాబాద్) గారు బాబా చెప్పిన చైతన్యము, ఆత్మ సాక్షాత్కారము గురించి వివరముగా తెలియజేసిరి.

మధ్యాహ్నము 12.30 ని॥ ల నుండి సాయంత్రము 3 వరకు సామూహిక భోజన కార్యక్రమములో సుమారు 800 మంది పాల్గొని బాబా ప్రసాదము స్వీకరించిరి.

***- రామచంద్రయ్య, ఖమ్మం.***

## ఖమ్మం సెంటర్‌లో వీడియో చిత్రీకరణ

17.02.2010న శ్రీని బాబు చెన్నై నుంచి ఆంధ్రప్రదేస్‌లోని కొన్ని బాబా సెంటర్లను సెలక్టచేసుకొని తన బృందంతో ఖమ్మం విచ్చేసిరి. వారు సెంటరును అన్ని కోణములలో వీడియో ఫిల్ము ద్వారా చిత్రీకరించి తాను సెలక్టు చేసుకున్న కొన్ని పాటలను పాడి ప్రేమికుల చేత పాడించిరి. ఈ కార్యక్రమములో ఖమ్మం సెంటరు ప్రేమికులందరూ

పాల్గొని ఆనందించిరి. అనంతరము ఏర్పాటు చేసిన ప్రేమ విందులో ప్రేమికులందరు పాల్గొనిరి.

## మెదక్ సెంటర్

బాబా పుట్టినరోజు సందర్భముగా 25.02.2010 (గురువారం) సాయంత్రం మెదక్ బాబా సెంటర్‌లో "శ్రీ బాబా వారు" భజనలు చేసినాము. తదుపరి మెహెర్‌బాబా సమాధి నుండి తెచ్చిన ప్రసాదము అందరికి యిచ్చి, కార్యక్రమము ముగించినాము.

**– ఎ. సుబ్రమణ్యం, మెదక్.**

## అపర మెహెరాబాదు........ తెటకుంటలో

జూన్ 2009 నుండి అపర మెహెరాబాదులో ధుని ప్రజ్వలన ప్రతి మాసము 12వ తేదీన ఉ। 8.30 నుంచి 9.30ల మధ్య జరుగుచున్నది. దీనిలో కరీంనగర్, సిరిసిల్ల, చంద్రంపేట, నేరెళ్ళ, ఎల్లారెడ్డిపేట ప్రేమికులు పాల్గొంటున్నారు. 12.02.201న శ్రీ బి. రామకృష్ణయ్య, ఉ॥ 9.30 గంటల ధుని ప్రజ్వలన చేశారు. ధుని ప్రాశస్త్యాన్ని వివరంగా తెలియజేశారు. దీనిని భక్తి చానల్ టి.వి. వారు ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో గాయకులు శ్రీ ఎన్.లక్ష్మినర్సింహారావు, సెక్రెటరీ, అవతార్ మెహెర్‌బాబా ట్రస్ట్ కరీంనగర్, చంద్రంపేట కార్యదర్శి కాంభోజి శ్రీనివాస్, ఎల్లారెడ్డిపేట ట్రస్టు మెంబర్ శ్రీ చకిలం రాజేశం, సిరిసిల్ల సెంటర్ కార్యదర్శి శ్రీ బద్దెపురి బాలయ్య, అధ్యక్షులు శ్రీ సామల రాజమల్లయ్య తదితర ప్రేమికులు పాల్గొని భజన, సహవాస కార్యక్రమం విజయవంతం చేశారు. 25 ఫిబ్రవరి 2010న బాబా గారి 116వ జన్మదినోత్సవం వైభవోపేతముగా జరిగింది. ఉదయం 5 గంటలకు బాబా జనన కాలహారతి మరియు ప్రార్ధనలు నిర్వహించడం జరిగింది. శ్రీ దుగ్యాల ప్రభాకర్‌రావు, చైర్మన్‌గారు కేక్ కట్టింగ్ చేసారు. సప్తవర్ణ పతాకం శ్రీ సిహెచ్. సత్యనారాయణరాజు, ఎం.ఇ.ఓ., సిరిసిల్ల గారిచే ఆవిష్కరించబడింది. ధుని ప్రజ్వలన శ్రీ కె.రాంచంద్రం, అవతార్ మెహెర్‌బాబా రామాయణ్‌పేట కార్యదర్శి గారిచే గావించబడింది. ఆ తర్వాత పురవీధుల్లో మెహెర్‌బాబా ఊరేగింపు జరిగింది.

## శ్రీకాకుళం సెంటర్‌లో

శ్రీకాకుళం సెంటర్‌లో అవతార్ మెహెర్‌బాబా వారి 116వ జన్మదినోత్సవ సందర్భముగా 25.02.200 గురువారం స్థానిక అవతార్ మెహెర్‌బాబా, కత్తెరవీధి కేంద్రములో జన్మదిన వేడుకలు మెహెర్‌ప్రేమిక సహవాస్ నిర్వహించినట్లు శ్రీ ఎస్.వి. సత్యన్నారాయణ, అధ్యక్షులు, శ్రీ పి.వి. రంగప్రసాద రావు, కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.





## శ్రీకాకుళం

అవతార్ మెహెర్‌బాబా 116వ జన్మదిన వేడుకల సందర్భముగా శ్రీకాకుళం కత్తెరవీధిలో గల మెహెర్‌బాబా కేంద్రంలో సేవా కార్యక్రమాలలో భాగంగా 14.02.10 ఆదివారం ఉ॥ 10 నుండి మ॥ 12.30 వరకు ప్రఖ్యాతిగాంచిన నేత్ర వైద్యనిపుణులచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి గుర్తింపబడిన వ్యక్తులకు కంటి ఆపరేషన్‌లు, కంటి అద్దాలు అందజేసినామని కార్యనిర్వాకులు తెలిపారు.

## గోదావరిఖని సెంటర్

అవతార్ మెహెర్‌బాబా వారి 116వ జన్మదిన వేడుకలు సదర్భంగా 5.02.2010 గురువారం రోజున ఉదయం 5 గంటలకు హారతి, 8.35 ని॥లకు సప్తవర్ణ పతాక ఆవిష్కరణ, శ్రీ ఎం. రాజారావు ఎన్‌టి.పి.సి. గారిచే ఉ॥ 9.05 ని॥లకు దుని వెలిగించడమైంది. ఉ॥ 10.05 ని॥లకు బ్రహ్మాండమైన ఊరేగింపు సా॥ 6.05 ని॥ల నుండి బర్త్‌డే కేక్ కట్ చేశామని అధ్యక్షులు శ్రీవి. రామ్‌మోహన్ రావు తెలిపారు.

సా॥ 6.15కు ఉయ్యాల, 6.55కు వికలాంగులకు వస్త్రములు పంపిణి, సా॥ 7.05 నుండి 8.35 వరకు మెహెర్‌బాబా సెంటర్ ప్రేమికుల భజన కార్యక్రమం అనంతరం హారతి యిచ్చామని శ్రీ రామ్‌మోహన్‌రావు తెలిపారు.

# హిందూపూర్‌లో ఏకాహం

అనంతపురం జిల్లా హిందూపురంలోని మారుతీ లాడ్జ్ (కె.ఎల్.రోడ్) ఆవరణలో 2010 మే ఒకటి– రెండు తేదీలలో ఉదయం 7 నుండి మర్నాడు 7 గంటల వరకు మెహెర్‌బాబా ఏకాహం నిర్వహించవలెనని తలపెట్టినట్లు సెంటర్ కార్యదర్శి శ్రీ యం.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏకాహంలో పాల్గొనదలిచవారు వివిధ జిల్లాలకు చెందిన పలువురు బాబా ప్రేమికులు తమ వివరాలు 9441081623, – 9908854805, ఏప్రిల్ 20లోగా కె.ఎస్. విశ్వనాథ్, మారుతీలాడ్జ్, కె.ఎల్.రోడ్, హిందుపూర్, అనంతపూర్ జిల్లా పంపవల్సిందిగా కోరుతున్నారు.

## ఎర్ర అడ్రస్సుల తొలగింపు

పాత బకాయిలుతో సుమారు రెండు మూడేళ్ళుగా మెహెర్‌బాబా మాస పత్రికకు వార్షిక సభ్యత్వం చెల్లించని అడ్రస్సులను మార్చి 2010 సంచిక నుండి తొలగించినట్లు మనవి.

**మెహెర్‌బాబా పత్రిక**

# మెహెర్‌బాబా 116వ జన్మదినోత్సవాలు

## జంటనగరాలలో

జంటనగరాలలో అవతారుని 116వ జన్మదిన వేడుకలు కడు రమ్యంగా జరిగాయి. ఫిబ్రవరి 25న జూబ్లిసెంటర్‌లో తెల్లవారు ఝామున 5 గంటలకు అవతారునికి ఆరతి ఇచ్చి ప్రార్థనలు చేశారు. అనంతరం స్థానిక బాబాప్రేమికులు శ్రీ రామచందర్, శ్రీ వెంకట్, శ్రీ సంగం నాయుడు బృందం వారి అవతారుని జన్మదినోత్సవ ప్రత్యేక బుర్రకథాగానం, సప్తవర్ణ పతాకావిష్కరణ (శ్రీ అనిల్ నోరి) ధుని ప్రజ్వలన (డా॥ చంద్రమాల) చేశారు. ధుని విశిష్టతపై శ్రీ పి.ఎస్.కె.శర్మ సంక్షిప్త ప్రసంగం చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన భజన కార్యక్రమంలో శ్రీ సుశీల, శ్రీమతి శైలజ, శ్రీమతి కనకదుర్గ, శ్రీమతి పద్మావతి, బాబావారి సందేశాలపై శ్రీ సోమశేఖర్, శ్రీ వినయ్, శ్రీమతి శివనాగేశ్వరి, శ్రీ ప్రసాదరాజు తదితరులు ప్రసంగించారు.

శ్రీమతి నోరి స్వర్ణ దర్శకత్వంలో బాబావారి జీవితకాలంలోని మూడు ఘట్టాలు చక్కగా ప్రదర్శించారు. ఈ నాటికలలో మెహెర్‌బాబా వేషధారణలో శ్రీ నోరి సూర్యనారాయణ, మరి ఇతర పాత్రధారణలలో శ్రీ ధర్మసాగర్, శ్రీ కాశీవిశ్వనాథ్, శ్రీ బి. రామ క్రిష్ణయ్య, శ్రీమతి నోరి కిరణ్, శ్రీ శ్రీనివాస్, తదితరులు నటించారు.

ఫిబ్రవరి25, సాయంత్రం కోఠి సెంటర్ ప్రాంగణంలోను, ఫిబ్రవరి 26న సీతాఫల్‌మండి, సికింద్రాబాద్ సెంటర్‌లోను ఫిబ్రవరి 27న మల్కాజ్‌గిరి సెంటర్‌లోను బాబా జన్మదిన కార్యక్రమాలు కడు రమ్యంగా జరిగాయి.

కుమారి ఆశ్చర్య, హరిప్రియ, సుస్మశ్రీ, వినిత, తేజస్వి, రిషిక, మెహెర్ నిధి, ప్రణవిల నృత్యరూపకాలు, గోపి ఆలాపించిన ఘజల్లు- బాబా వారి భజనలు పలువుర్ని అలరించాయి. మల్కాజ్‌గిరి సెంటర్‌లో బాబావారి సందేశాలపై **'తపన'** పేరిట **మాట- పాటల** సంగీత రూపకాన్ని శ్రీ పన్నగేశ్వరరావు, శ్రీ రమణ (పండగమ్మ- పండగే) చక్కగా నిర్వహించారు. శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

హైదరాబాద్- సికింద్రాబాద్ జంటనగరాలలో గత 116 దినాలుగా జరుగుతున్న బాబావారి జన్మదినోత్సవ వేడుకల సంబరాలు ఫిబ్రవరి 28న సికింద్రాబాద్‌లోని శ్రీ ఓం ప్రకాశ్ గారి ఇంట్లో జరిగిన ప్రేమిక సహవాస్‌తో ఘనంగా ముగిశాయి.

**- సంచారి..**

## కాకినాడ కేంద్రం

కాకినాడ కేంద్రం రామారావుపేటలో బాబావారి 116వ జన్మదిన వేడుకలు ఘనంగా ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు.





## సాయినగర్, కరీంనగర్‌లో

అవతార్ మెహెర్‌బాబా 116వ జన్మదిన వేడుకల శుభసందర్భంగా ఎ.ఎమ్.బి. సెంటర్ సాయినగర్, కరీంనగర్ ఆధ్వర్యములో 01.02.2010 నుండి 25.02.2010 వరకు కరీంనగర్ పట్టణములోని బాబా ప్రేమకుల గృహములలో వాడవాడలా బాబా జన్మదిన వేడుకలు చాలా ఘనంగా నిర్వహించడమైంది.

11.02.2010 గురువారమునాడు బాబా **భక్తిమాల ప్రత్యేక కార్యక్రమము** శ్రీ కె.వి.వి.రమణ (పండగ రమణ) హైదరాబాద్ పాల్గొని వారి మధురమైన పాటలతో బాబా ప్రేమికులను ఎంతగానో ఆనందింపచేసారు. శ్రీ జితేంద్ర శర్మ& పార్టీ (హన్మకొండ) గారి "బాబా" గానా మృతము బాబా ప్రేమికులకు బాబా ప్రేమతో ఉర్రూతలూగించి సంతోషపరిచినది.

25.02.2010 ఉదయం 5 గం॥ నుండి 10 వరకు ఎ.ఎమ్.బి. సెంటర్ సాయినగర్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ వి.లక్ష్మన్ కుమార్, ఛైర్మన్, జిల్లా పరిషత్ పాల్గొన్నారు.

**బ్రహ్మాండమైన ఊరేగింపు-** గత 20 సం॥ నుండి ఎ.ఎమ్.బి. సెంటర్ సాయినగర్, ఆధ్వర్యములో బాబా జన్మదిన ఊరేగింపు కార్యక్రమము నిర్వహించుచున్నది. ఈ సంవత్సరము కూడా బాబా ఊరేగింపును పెద్ద ఎత్తున నిర్వహించడము జరిగినది.

ఈ కార్యక్రమాలలో అధ్యక్షులు-సి.హెచ్.జనార్దన్, కార్యదర్శి, యన్. లక్ష్మీ నరసింహ రావు, పి. ప్రభాకర్ రావు, పి.భూమన్న, బి.అశోక్ మొదలగు వారలు మరియు వివిధ సెంటర్ల ప్రేమికులు గట్టుభూత్కూర్- శ్రీ యస్. రాంరెడ్డి, శ్రీ సి.హెచ్. మల్లారెడ్డి అర్నకొండ- డి. మాధవరావు గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో శ్రీశ్రీశ్రీ సనకసదానంద స్వామిజి కొత్తపల్లి ఆశ్రమము గారు కూడా పాల్గొన్నారు.

***- యన్.లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి***

## జి.సింగడాంలో

జి.సింగాడాంలోని అవతార్ మెహెర్‌బాబా కూడలిలో గురువారం అవతార్ మెహెర్‌బాబా 116వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శుల గోపాలరావు, గోవిందరావుల ఆద్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో బాబా ప్రేమికులు రామకృష్ణ మాట్లాడుతూ బాబా ప్రవచనాలను వినిపించారు. ఉదయం 5 గంటలకు పూజలు నిర్వహించి బాబా చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనతరం సప్తవర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిట్టిబాబు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# జీవిత సభ్యత్వం

## 2010 ఫిబ్రవరి - మార్చి నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | మార్చి 10 | శ్రీమతి కుసుమ మెహెర్‌లక్ష్మి, హైదరాబాద్ | రు. 1000.00 |
| 2. | మార్చి 10 | డా॥ సి.ఇ.లక్ష్మీ నారాయణ, హైదరాబాద్ | రు. 1000.00 |
| 3. | మార్చి 10 | శ్రీ సిహెచ్.సాంబశివరావు, మెదక్ | రు. 500.00 |
| 4. | మార్చి 10 | శ్రీ సిహెచ్.వి.దాస్, రామాయణపేటట | రు. 500.00 |
| 5. | మార్చి 10 | శ్రీ జక్క రామచందర్, బాలకొండా నిజామాబాద్ | రు. 1000.00 |
| | | **మొత్తం** | **రు. 4,000.00** |

# జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు).
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు.
3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. ఒక్క పైసా కూడా పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించలేదు.
4. జీవిత సభ్యత్వం చెల్లించిన సభ్యులు తాము ఎప్పుడు పత్రిక వద్దని కోరితే, తక్షణం, వారు చెల్లించిన జీవిత సభ్యత్వం మొత్తం, వడ్డీ లేకుండా అసలు వాపసు ఇవ్వడమవుతుంది.
5. వార్షిక సభ్యత్వం రూ.100/- 5) మీ అడ్రస్సులో పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా వ్రాయవలసింది. 6) బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.
   మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు

మా అడ్రస్: **ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500 087, ఫోన్: 99595-53218.**





# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు,
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేనివాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతట గలవు,
నీవు అన్నింట నున్నావు
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకములలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయాలను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంత జ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞాన సాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంత గుణ విశిష్టుడవు,
నీవు సత్య,
జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహా సాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోన్నతుడవు,
ప్రభుడవు
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్దాన్,
అహురామజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు **'ఈజద్'** అనబడు
ఏకైక పూజ్యుడవు.